
రియల్ ఎస్టేట్ నిలిచిపోవడంతో ప్లాట్లలో కంపచెట్లు పెరిగిన దృశ్యం

'రియల్' డీలా

● నిలిచిపోయిన రూ.100 కోట్ల వ్యాపారాలు
● ఆందోళనలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు

రియల్ ఎస్టేట్ వ్యాపారం.. బాగా లాభదాయకంగా ఉంటుందని చేతిలో పది లక్షలు ఉన్నా కోటిరూపాయల వ్యాపారం చేయొచ్చని రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు పెట్టిన వారంతా ఇప్పుడు లబోదిబో అంటున్నారు. బద్వేలు నియోజకవర్గంలో బద్వేలు తర్వాత పోరుమామిళ్ల ప్రధాన పట్టణం. చుట్టుపక్కల గ్రామాల వారు ఇక్కడికి వచ్చి నివాసం ఉంటున్నారు. వ్యాపారాలు చేస్తున్నారు. ఒక వైపు ఫోర్‌లేన్ వస్తుంది, మరో వైపు సిక్స్‌లేన్ వస్తుంది.. ఈ ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేస్తే తమ భవిష్యత్తు బంగారుమయం అవుతుందని భావించి చాలా మంది భూములను కొనుగోలు చేసి రియల్ ఎస్టేట్‌లుగా మార్చారు. కానీ ఉన్నట్లుండి ఒక్కసారిగా మార్కెట్ డీలా పడడం, రీసేల్ చేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో రియల్ ఎస్టేట్ పూర్తిగా నిలిచిపోయింది.

పోరుమామిళ్ల, ఏప్రిల్ 15: పోరుమామిళ్లలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు దాదాపు 50 మంది ఉన్నారు. వీరి భాగస్వాములు అంతకంటే ఎక్కువమంది ఉన్నారు. అంతేకాక చాలామంది ఉద్యోగస్తులు కూడా ఈ వ్యాపారంలో అడుగు పెట్టారు. మరికొందరు భూములు కొనుగోలు చేసి 1/4 అమౌంటు చెల్లించి మరొకరికి చేతులు మార్చారు. మొదటి ఇద్దరు బాగానే ఉన్నా థర్డ్‌పార్టీ చేతికి వచ్చే సరికి కొనుగోలుదారులు కరువు కావడంతో అమ్ముకోలేక.. చేతిలో చిల్లిగవ్వ లేని పరిస్థితి ఏర్పడింది.

పోరుమామిళ్ల మండలంలో దాదాపు 50 వెంచర్లు వేసినట్లు సమాచారం. ఒక వైపు రెడ్డికొట్టాల తిప్ప వైపు, మరో వైపు ఆదిఆంధ్రపాలెం సమీపంలోని తిప్ప వరకు చెన్నారెడ్డిపేట, నర్సింగపల్లె వరకు ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూములు కొనుగోలు చేసి ప్లాట్లను ఏర్పాటు చేశారు. రాజకీయ పలుకుబడి ఉన్న వారు ఎలాగోలా తమ ప్లాట్లను అమ్మకాలు జరుపుతున్నారే తప్ప మిగలిన వారి ప్లాట్లు కొనడానికి, అమ్మించడానికి ఎవరూ ముందుకు రావడంలేదు. దీంతో వారు వేసిన ప్లాట్లలో కంపచెట్లు పెరిగిపోయాయి. కరోనాకు ముందు పోరుమామిళ్ల ప్రాంతంలోని వారు బెంగళూరు, హైదరాబాదు తదితర ప్రాంతాల్లో పేయింగ్ గెస్ట్ (పీజీ) హాస్టల్స్ నిర్వహించేవారు. కరోనా సమయంలో ఇవన్నీ మూతపడ్డాయి. అక్కడ ఎలాగూ పీజీలు నడవడంలేదని భావించి ఆ డబ్బులంతా రియల్ ఎస్టేట్‌లో పెట్టడంతో అప్పట్లో ఈ వ్యాపారం ఒక్కసారిగా పుంజుకున్నట్లయింది. ప్రస్తుతం ఎవరూ ఈ ప్లాట్లపై ఆసక్తి చూపడం లేదు. తిరిగి బెంగళూరు, హైదరాబాదు ప్రాంతాల్లో పీజీలు మళ్లీ మొదలు కావడంతో అక్కడ వారి వ్యాపారం లాభదాయకంగా ఉండడంతో పోరుమామిళ్ల ప్రాంతంలో రియల్ ఎస్టేట్ చేసేవారిలో కొంతమంది పెట్టుబడిదారులు బెంగళూరు తదితర ప్రాంతాలకు వెళ్లిపోయారు. దీంతో పోరుమామిళ్లలో ప్రస్తుతం రియల్ ఎస్టేట్ ఊసే ఎత్తడం మానుకున్నారు. ప్రస్తుతం దాదాపు రూ.వంద కోట్ల వరకు ఈ మండలంలో వ్యాపారాలు నిలిచిపోయాయని సమాచారం. కొందరు అప్పులు చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నట్లు సమాచారం. మరో పదిమంది ఏం చేయాలో తెలియక దిక్కుతోచని స్థితిలో తలలు పట్టుకుంటున్నారు. మరి ఎన్నికలు అయిన తరువాత ఏమైనా రియల్ ఎస్టేట్ మళ్లీ పుంజుకుంటుందేమో అన్న ఆశతో వ్యాపారులు ఉన్నారు.



వలంటీర్లే దిక్కు..!

● వైసీపీకి ఓటమి భయం
● సొంత పార్టీ ప్రజా ప్రతినిధులు, నేతలపై కలగని నమ్మకం
● వలంటీర్లే గెలిపిస్తారని ఆశ
● రాజీనామా చేసి ప్రచారం చేయాలని హుకుం
● వత్తిళ్లు భరించలేక వలంటీర్ల రాజీనామా


ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో రాజీనామా పత్రాలు చూపుతున్న వలంటీర్లు



నిన్నటి దాకా జనం సొమ్ముతో జీతాలు తీసుకుంటూ ఇప్పుడు ఎలా ఓ పార్టీకి కొమ్ముకాస్తారంటూ జనం ఆగ్రహం.. మీకు మంచి జరిగింటే మళ్లీ మాకు ఓటు వేయండి అంటూ ఓ పక్క జగన్ అండ్ కో మేకపోతు గాంభీర్యాలు.. మళ్లీ వైసీపీదే అధికారం అంటూ ఫేక్ సర్వేలతో హడావుడి.. మేమంతా సిద్ధం పేరిట బస్సు యాత్రలు.. అయినా ఊహించినంతగా రాని మైలేజీ. గ్రౌండ్ లెవల్‌లో పార్టీ బలహీనంగా ఉందని వైసీపీ నేతలు గుర్తించినట్లున్నారు. అందుకే వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం భారమంతా వలంటీర్లపై వేశారు. గెలవాలంటే వీరే దిక్కు అని డిసైడ్ అయ్యారు. వలంటీర్లు రాజీనామా చేసి ప్రచారంలో పాల్గొనాలంటూ ఆదేశించారు.

(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు ఎన్నికల ప్రచారాన్ని ఊరూరా నిర్వహిస్తున్నారు. నిన్నటిదాకా ప్రభుత్వ సంక్షేమ పథకాల క్యాంపెయిన్ మొదలుకుని సభలు, సమావేశాలు అన్నింటినీ వలంటీర్లను అడ్డుపెట్టుకుని చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 50 ఇళ్లకు, పట్టణప్రాంతాల్లో వంద ఇళ్లకు ఒక్కో వలంటీర్ ఉన్నారు. వైసీపీ సభలు, సమావేశాలకు రాకపోతే పథకాలు కట్ చేస్తామని హెచ్చరించి వీరు జనాలను తీసుకొచ్చేవారు. అయితే ఎన్నికల ప్రచారంలో వలంటీర్లను ఎలక్షన్ కమిషన్ దూరం పెట్టింది. నిబంధనలు ఉల్లంఘించి ప్రచారంలో పాల్గొన్నవారిపై వేటు వేసింది. దీంతో వలంటీర్లు ప్రచారానికి పోవడంలేదు. ఎన్నికల ప్రచారంలో వైసీపీ నేతలు ఇంటింటికీ వెళుతుంటే స్పందన అంతంత మాత్రమే ఉంది. జగన్ సీఎం అయిన తరువాత కేడరును పట్టించుకోవడం వదిలేసి కొందరికే ప్రాధాన్యం ఇచ్చేవారు. దీంతో కొందరు కేడరు నిరుత్సాహంలో ఉన్నారు. దీంతో డివిజన్లు, వార్డులు గ్రామాలకు వెళ్లినప్పుడు జనం నుంచి స్పందన కరువైంది.

వలంటీర్లే ఆధారం

మంచి చేసి ఉంటే ఎన్నికల్లో ఓటు వేయండని ఓ పక్క జగన్ శిబిరం కటింగ్ ఇస్తోంది. 59నెలల జగన్‌పాలనలో మంచి కొద్దో గొప్పో జరిగితే చెడు మాత్రం అందరికీ తగిలింది. ఇచ్చిన హామీలను మడత పెట్టేయడం, కరెంటు చార్జీలు చెత్తపన్ను, పెట్రోలు ధరలు ఇలా రకరకాల పన్నుల భారం జనం అందరిపై పడింది. మొన్నటి వరకు గ్రౌండ్ లెవెల్‌లో బాగుందనుకున్నారు. కొందరు వైసీపీ నేతలు అధికారం మాటున అరాచకాలకు పాల్పడ్డారు. కేడరు కూడా ఇదే బాటలో నడిచింది. ఇలాంటి వారంతా ప్రచారానికి వస్తే జనం ఓట్లు వేయరనే భయం వైసీపీలో నెలకొంది. దీంతో వలంటీర్లను రిజైన్ చేసి ప్రచారంలో పాల్గొనమని ఆదేశిస్తున్నట్లు చెబుతున్నారు. మిమ్మల్ని పెట్టింది మేమే.. మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే.. మళ్లీ మీరే వలంటీర్లు.. అంటూ వారిపై వత్తిడి తెచ్చి రిజైన్ చేయిస్తున్నారు. జిల్లాలో 10,594 మంది వార్డు వలంటీర్లు ఉన్నారు. వారిపై రెండురోజుల నుంచి తీవ్ర వత్తిడి తెస్తున్నారు.

బలవంతపు రాజీనామాలు

జిల్లాలో తొలుత ప్రొద్దుటూరు నియోజకవర్గంలోనే వలంటీర్లు రాజీనామాలు చేయడం మొదలుపెట్టారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిపై నియోజకవర్గంలో తీవ్ర వ్యతిరేకత ఉందంటారు. ప్రొద్దుటూరు ల్యాండ్ సెటిల్‌మెంట్లు, ఇతరత్రా వాటికి కేరాఫ్ అయిందనే విమర్శ ఉంది. క్రికెట్ బెట్టింగ్, నకిలీ నోట్లు చెలామణి కూడా చేస్తున్నారనే తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఎమ్మెల్యే రాచమల్లుకు ఓటమి భయం పట్టుకుందనే ప్రచారం జోరుగా నడుస్తోంది. ఈ నేపథ్యంలో వలంటీర్లపై తీవ్రస్థాయిలో వత్తిడి తెచ్చి రాజీనామా చేయించారంటారు. ఇప్పటికే కొందరు రాజీనామా చేయగా.. సోమవారం పలువురు వలంటీర్లతో వైసీపీ నేతలు, కౌన్సిలర్లు బలవంతం చేసి రాజీనామా చేయించారని ప్రచారం సాగుతోంది. అనంతరం వారందరినీ వైసీపీ కార్యాలయానికి తీసుకెళ్లి ఏప్రిల్ నుంచి జూన్ వరకు వేతనాలను తామే చెల్లిస్తామని హామీ ఇచ్చారని చెబుతున్నారు.

కడపలో..

కడపలో మొన్నటి వరకు వార్ వన్‌సైడ్ అన్నట్లుగా గెలుపు తమదేనని డిప్యూటీ సీఎం అంజద్‌బాషా శిబిరం విర్రవీగిందంటారు. టీడీపీ అభ్యర్థిగా మాధవీరెడ్డి రంగంలోకి వచ్చిన తరువాత డోర్ టు డోర్ తిరిగి వైసీపీ నేతలకు ముచ్చెమటలు పోయించారు. తరువాత తెలిసింది ఇక్కడ వార్ వన్‌సైడ్‌కాదని. ఎలాగైనా సరే గెలవాలని వైసీపీ నేతలు డిసైడ్ అయినట్లు చెబుతారు. దీంతో ఇక్కడ కూడా వలంటీర్లపై రాజీనామా కోసం వత్తిడి చేస్తున్నారు. మూడు రోజులక్రితం 120 మంది రాజీనామా చేస్తే సోమవారం 200 మందికి పైగా వలంటీర్లు రాజీనామా చేశారు. ఇక వలంటీర్లంతా రాజీనామా చేయాలంటూ ఇప్పటికే బద్వేలులో ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, సుధీర్‌రెడ్డి హుకుం జారీ చేశారని అంటున్నారు.

కార్యకర్తలను నమ్మలేక

ఏదైనా బిల్డింగు బాగుండాలంటే పునాది ముఖ్యం. అలాగే పార్టీ కూడా పటిష్టంగా ఉండాలంటే కార్యకర్తలు ముఖ్యం. కాంగ్రెస్ నుంచి బయటికి వచ్చిన జగన్ సొంత పార్టీ పెట్టారు. అప్పటి వరకు కాంగ్రెస్‌లో ఉన్న వారిలో కొందరు జగన్ వెంట నడిచారు. జగన్ సీఎం అయిన తరువాత కేడరును పట్టించుకోకుండా వదిలేశారు. ఏదో మండలానికి ఇద్దరు ముగ్గురు మాత్రమే సంపాదించుకునే అవకాశం ఇచ్చారంటారు. దీంతో కేడర్ జగన్‌కు బాగా దూరం ఉందంటారు. వలంటీరు వ్యవస్థ వచ్చిన తరువాత కేడరుతో పనిలేకుండా పోయింది. సంక్షేమ పథకాలు ఇతరత్రా వాటిని వారితోనే నడిపిస్తున్నారు. ఇది కొందరు వైసీపీ నేతలకు కంటగింపుగా మారింది. కాగా.. ఎన్నికల్లో వలంటీర్లు వద్దని ఎన్నికల కమిషన్ చెప్పింది. ఇప్పుడు వైసీపీ నేతలు, కార్యకర్తలు ప్రచారానికి వెళుతుంటే జనం నుంచి సరిగా స్పందనలేదని అంటున్నారు. దీంతో వలంటీర్లను రాజీనామా చేసి ప్రచారంలో పాల్గొనాలని వత్తిడి తెస్తున్నట్లు చెబుతున్నారు. జగన్ శిబిరం పార్టీ కార్యకర్తల కన్నా వలంటీర్లనే నమ్ముకుంది. ఇప్పుడు రిజైన్ చేస్తే ఎన్నికల్లో వలంటీర్లను ఏజెంట్లుగా పెట్టి ఓటర్లను ప్రలోభాలకు గురిచేయాలనే ఉద్దేశంలో వైసీపీ ఉందనే ప్రచారం జరుగుతోంది. మొత్తానికి అయితే ఇప్పుడు వైసీపీకి వలంటీర్లే దిక్కు అయ్యారు. మరి ఇన్నాళ్లు చేశామంటున్న సంక్షేమం ఏమైందో..?

షర్మిల ఫ్లెక్సీలు చించిన టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

● 25 వరకు అనుమతులున్నాయి
● ఫ్లెక్సీలు చించేందుకు కారణమైన ఏసీపీపై చర్యలు తీసుకోవాలి
● ఏఈఆర్వోకు ఇండియా కూటమి నేతల ఫిర్యాదు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 15: ప్రొద్దుటూరులో ఇండియా కూటమి వేసిన వైఎస్ షర్మిల పర్యటన ఫ్లెక్సీలను టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించటంపై ఎన్నికల ఏఈఆర్వోకు కూటమి నేతలు నజీర్, రామయ్య, సుబ్బరాయుడు ఫిర్యాదు చేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో ఏఈఆర్వో, తహశీల్దారు విద్యాసాగర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏప్రిల్ 25 వరకు అనుమతులు తీసుకుని రూ.25 వేల చలానా కట్టి వైఎస్ షర్మిల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశామన్నారు. అయినా వాటిని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తొలగించారన్నారు. ఎమ్మెల్యే రాచమల్లుపై మొన్నటి ప్రొద్దుటూరు పర్యటనలో కడప కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల విమర్శించిన నేపథ్యంలో మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల చేత బలవంతంగా ఫ్లెక్సీలు చించివేయించారన్నారు. ఇవి రెచ్చగొట్టే చర్యలని అన్నారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మునిరత్నం సిబ్బందిని ఆదేశించి ఈపని చేశారన్నారు. అతన్ని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మునిరత్నంపై అనేక అవినీతి ఆరోపణలు న్నాయన్నారు. అతను ఇదివరకే ఏసీబీకి పట్టుబడి కేసు నడుస్తోందన్నారు. అతనికి ఫోకల్ పోస్టు ఇవ్వరాదని స్పష్టమైన ఆదేశాలున్నా మున్సిపాలిటీలో అతనికి ఏసీపీ విధులు ఇచ్చారన్నారు. అతను వైసీపీకి అనుకూలంగా విధులు నిర్వహిస్తున్నాడని, అతనే తన సిబ్బంది చేత ఫ్లెక్సీలు చించివేయించి మళ్లీ ఎవ్వరో పిచ్చోళ్లు తొలగించారని అపద్ధాలు చెబుతున్నాడన్నారు. అతని చర్యలవల్ల ప్రొద్దుటూరులో శాంతిభద్రతల సమస్య ఏర్పడుతోందన్నారు. అధికారులు అతనిపై విచారించి ఎన్నికల విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు.

బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ



ఒంటిమిట్ట, ఏప్రిల్ 15 : ఒంటిమిట్ట కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు మంగళవారం అంకురార్పణ జరగనుంది. బ్రహ్మోత్సవాలకు టీటీడీ పటిష్టమైన ఏర్పాట్లను చేపట్టింది. రామాలయంలో చలువపందిళ్లు, ప్రత్యేక క్యూలైన్, మాడవీధుల్లో చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఈనెల 16వ తేదీ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేయనున్నారు. అంకురార్పణలో స్వామి వారి బ్రహ్మోత్సవాలకు రామాలయంలోని పుట్ట నుంచి పుట్ట మన్ను తీసుకొచ్చి బ్రహ్మోత్సవాలకు హోమగుండంతో అంకురార్పణ చేయనున్నారు. 16 నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు 26 వరకు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలను టీటీడీ వైష్ణవ సంప్రదాయం ఆగమ శాస్త్ర ప్రకారం వేదపండితులు, టీటీడీ అర్చకులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల కోసం రామాలయం మొత్తం విద్యుద్దీపాలంకరణ, చలువపందిళ్లతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు.

రామాలయంలో పోతన కవి సమ్మేళనం

కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి, పోతన జయంతిని పురస్కరించుకుని టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఈనెల 17, 18వ తేదీల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణంలో 17వ తేదీ ప్రముఖ పండితులు శంకర్-భాగవతం ప్రాశస్త్యం, ఎం.నారాయణరెడ్డి-గజేంద్రుని ఆక్రందన, డాక్టర్ సుమన-మండోదరి హితబోధ, గోపాలకృష్ణ శాస్త్రి-సీతా స్వయంవరం, శివశంకర్-రుక్మిణీ సందేశం, శివారెడ్డి-ఒంటిమిట్ట రామాలయం ప్రాశస్త్యం అంశాలపై కవి సమ్మేళనం జరుగుతుంది. అదే విధంగా ఏప్రిల్ 18వ తేదీ రాంప్రసాద్‌రెడ్డి-ఒంటిమిట్ట కోదండరామాలయ ప్రాశస్త్యం, వెంకటరమణ-హనుమత్ సందేశం, నీలవేణి-రంతు దేవుని చరిత్ర, వెంకటేశ్వర ఆచారి- శ్రీరామలక్ష్మణుల సోదర ప్రేమ, మధుసూదన్-శ్రీకృష్ణలీల, మల్లికార్జునరెడ్డి-జానకి సందేశం, నరసింహులు-రామరాజ్యం, జగన్నాథ్-సుందరకాండ అంశాలపై కవి సమ్మేళనం నిర్వహిస్తారు. కోదండరామస్వామి ఆలయ ప్రాంగణంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా 17 నుంచి 25వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఆధ్యాత్మిక భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

బ్రహ్మోత్సవాలలో వాహన సేవలు

కోదండరాముడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం వ్యాసాభిషేకం, సాయంత్రం అంకురార్పణతో ప్రారంభం కానున్నాయి. బుధవారం ధ్వజారోహణం ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల మధ్య మిధున లగ్నంలో నిర్వహించనున్నారు. సాయంత్రం శేషవాహనంలో స్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారు. గురువారం ఉదయం వేణుగానాలంకారం, సాయంత్రం హంసవాహనం, శుక్రవారం వటపత్రశాయి అలంకారం, సాయంత్రం సింహవాహనంపై గ్రామోత్సవం నిర్వహించనున్నారు. శనివారం ఉదయం నవనీత కృష్ణ అలంకారం, సాయంత్రం హనుమంత వాహనంపై గ్రామోత్సవం, ఆదివారం మోహినీ అలంకారం, సాయంత్రం గరుడ వాహనంపై విహరిస్తారు. సోమవారం ఉదయం శివధనుర్బాలంకారంలో, సాయంత్రం 6.30 నుంచి 8.30 గంటల మధ్య సీతారాముల కల్యాణం, అనంతరం గజవాహనంపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. మంగళవారం రథోత్సవం, బుధవారం కాళికామర్ధిని అలంకారంలో సాయంత్రం హంస వాహనంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. గురువారం ఉదయం చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణం, శుక్రవారం సాయంత్రం పుష్పయాగం, రాత్రికి ఏకాంత సేవలో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

18న ఎన్నికల నోటిఫికేషన్

● నామినేషన్లకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలి
● ఆదేశించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 15: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, అన్ని విభాగాల నోడల్ అధికారులతో కలసి సాధారణ ఎన్నికల సంసిద్ధతపై నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు (ఆర్వో), ఈఆర్వోలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 వ తేదీన సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో అదే రోజు నుంచి అభ్యర్థుల నామినేషన్ల దాఖలు ప్రారంభం కానుందన్నారు. నియోజకవర్గాల ఆర్వోలు అందుకు సంబంధించిన ఏర్పాట్లను సిద్ధం చేసుకోవాలన్నారు. ఎక్కడా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు కోసం నమోదు చేసుకున్న వారందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. నియోజక వర్గాల వారీగా ఈవీఎంలు, వీవీప్యాట్ సామాగ్రిని భద్రంగా చేర్చుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద దివ్యాంగులకు, ట్రాన్స్‌జండర్స్ ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. అలాగే హోమ్ ఓటింగ్‌కు అర్హులైన ఓటర్ల డేటా సేకరణ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్‌లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎన్నికల విధులకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

సీపీఎస్‌పై మాట తప్పారు

కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా మారింది రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగుల పరిస్థితి. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తానని పాదయాత్రలో జగన్ హామీ ఇవ్వడంతో మెజార్టీ ఉద్యోగులు గత ఎన్నికల్లో వైసీపీకి మద్దతుగా నిలిచారు. తీరా అధికారం చేపట్టాక నాలుగేళ్లు దానిపై మాట్లాడకుండా మౌనం దాల్చి తీరిగ్గా.. రద్దు సాధ్యం కాదని తేల్చి అంతకంటే మంచిదంటూ జీపీఎస్‌ను తెరపైకి తీసుకురావడంతో ఉద్యోగ ఉపాధ్యాయులంతా మండిపడుతున్నారు. ప్రతిపక్షత నేతగా పాదయాత్రలో ఓపీఎస్ అమలు చేస్తామని 123 సార్లు వాగ్దానం చేసి.. తీరా అధికారం చేపట్టాక దానిని అమలు చేయకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఓపీఎస్ (పాత పెన్షన్ విధానం) అమలే ఎజెండాగా ఉద్యమిస్తామంటున్నారు.



● నాలుగేళ్ల పాటు నాన్చి చివరికి సాధ్యం కాదని ప్రకటన ● కొత్తగా జీపీఎస్ విధానం ● నమ్మించి దగా చేశారని ఉద్యోగుల మండిపాటు

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 15: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) పరిధిలో పనిచేసే ఉద్యోగులను వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిలువునా మోసం చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 2004 సెప్టెంబరు 1నుంచి సీపీఎస్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేశారు. అంటే ఆ తరువాత ప్రభుత్వ సర్వీసులో చేరిన ఉద్యోగులకు సీపీఎస్ మేరకు పింఛను అందుతుంది. అంతకు ముందు ఉద్యోగంలో చేరిన వారందరికీ పాత పింఛను విధానం మేరకు పింఛనుతో పాటు ఆరోగ్యకార్డులు, ఇతర ప్రయోజనాలు లభిస్తాయి. ఈ నేపథ్యంలో సీపీఎస్‌పై ఉద్యోగులు ఆందోళనకు దిగారు. ప్రతి ప్రభుత్వ హయాంలో పోరాటాలు చేశారు. సీపీఎస్‌కు ప్రత్యామ్నాయం ఇస్తామని 2014లో చంద్రబాబు భరోసా ఇచ్చినా ఉద్యోగులు మాత్రం సీపీఎస్ రద్దు తప్ప మరో మాట లేదని తేల్చి చెప్పారు. ఈ క్రమంలో రాష్ట్రంలో సీపీఎస్ ఉద్యోగుల సంఖ్య లక్షలకు చేరడంతో నిరసన స్వరం పెరిగింది.

పాదయాత్రలో మోసపూరిత హామీ

2018లో పాదయాత్ర చేపట్టిన అప్పటి విపక్ష నేత వైఎస్ జగన్.. తాను అధికారంలోకి వచ్చిన వారంలో సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇవ్వడంతో ఉద్యోగులంతా అతని అడుగులో అడుగువేశారు. పాదయాత్రలో వినతిపత్రాలు ఇచ్చి నీరాజనాలు పలికారు. గత ఎన్నికల్లో వైసీపీ విజయంలో కీలక భూమిక పోషించారు. తీరా అధికారంలోకి వచ్చాక సీపీఎస్ రద్దుపై కేబినెట్‌లో చర్చించి కమిటీ వేశారు. తరువాత మరో రెండు కమిటీలు వేసినా రద్దు మాట మరిచిపోయారు. ఈ క్రమంలో ఉద్యోగులు చలో విజయవాడకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి పోలీసులతో వైసీపీ ప్రభుత్వం గట్టిగా ప్రయత్నించినప్పుడే జగన్‌పై తమకు నమ్మకం పోయిందని ఉద్యోగ ఉపాధ్యాయులు వ్యాఖ్యానించారు. సీపీఎస్ రద్దు మాట దేవుడెరుగు.. సామాజిక మాధ్యమాల్లో వైసీపీ మూకలు తమపై విషం కక్కడం మరింత ఆవేదన కలిగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే మోసం చేయడంతో జిల్లాలో వేలమంది నష్టపోతున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సీపీఎస్ కొనసాగించడం అనైతికం..



సీపీఎస్ కొనసాగించడం అనైతికం. సీపీఎస్‌కు ప్రత్యామ్నాయం ఒప్పుకునే ప్రసక్తి లేదు. పాత పింఛను సాధించడమే లక్ష్యం. బ్రిటీషు పాలనలో పింఛను వ్యవస్థ అమలైనా ప్రజాస్వామ్య వ్యవస్థలో రద్దుకావడం శోచనీయం. నాడు ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోవడం ప్రస్తుత ప్రభుత్వం మడమ తిప్పినట్లే. అన్ని రాజకీయపార్టీలు సీపీఎస్ రద్దుపై తమ వైఖరి ఏంటో మేనిఫెస్టో ద్వారా తెలపాలి. ఓపీఎస్‌కే ఓటు అంటూ రాష్ట్రంలో ఉన్న అన్ని ఉద్యోగ ఉపాధ్యాయ పింఛనుదారుల సంఘాలన్నీ ఏకంగా నినాదాలు ఇవ్వాలి. ఉద్యోగ ఉపాధ్యాయుల సత్తా ఏంటో నిరూపించే సమయం ఆసన్నమైంది.

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్, అమరావతి

నమ్మించి నయ వంచన..



సీఎం జగన్ ఉద్యోగ ఉపాధ్యాయులను నమ్మించి నయవంచనకు గురిచేశారు. తాము అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే ఓపీఎస్ అమలు చేస్తామని 123సార్లు పాదయాత్రలో వాగ్దానం చేశారు. అధికారం చేపట్టాక అవగాహన లేకుండా వాగ్దానం చేశామని మాట మార్చారు. మరీ దుర్మార్గంగా సీపీఎస్ కాదని జీపీఎస్‌ను బలవంతంగా తీసుకువచ్చారు. దాదాపు పది వేల మంది ఉద్యోగ ఉపాధ్యాయులకు ఓపీఎస్ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం మెమో నెం.57 ద్వారా సూచించింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం రహస్యంగా జీవో నెం.2140 ద్వారా కేవలం ముగ్గురు ఐఏఎస్ అధికారులకు మాత్రం లబ్ధి చేకూర్చారు.

- గుజ్జల తిరుపాల్, పీఆర్‌టియు రాష్ట్ర సీపీఎస్ కన్వీనరు

జీపీఎస్ వద్దు..



ప్రజాప్రతినిధులకు మాత్రం నెలనెలా పింఛను ఇస్తున్నారు. 30సంవత్సరాలు ఉద్యోగం చేసిన ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు మాత్రం పింఛను ఇవ్వకుండా ఉండడం ఏవిధంగా న్యాయం? పాత పింఛను విధానం అమలు చేయాలి. పీఎఫ్‌ఆర్డీఏ చట్టంలో పింఛనుకు ఎటువంటి గ్యారంటీ లేదు. మార్కెట్లో ఉన్న ఒడిదుడుకులను బట్టి పింఛను వస్తుందని చెబుతుంది. స్టాక్ మార్కెట్ మీద ఆధారపడి వచ్చే పింఛను మాకు వద్దు. ప్రభుత్వం ఇటీవల ప్రభుత్వ ఉద్యోగుల జీతం నుంచి కాంట్రిబ్యూషన్ చేస్తూ ప్రకటించిన జీపీఎస్ విధానాన్ని ఉద్యోగ ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నారు.

- ఎస్.రామాంజనేయులు, ఎస్టీయుఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

పెన్షన్ లేకపోవడం దుర్మార్గం..



కోట్ల రూపాయల ఆస్తులు కలిగిన ఎంపీ, ఎమ్మెల్యేలకు పింఛను ఉంది. ప్రభుత్వ బాధ్యతలను అమలు పరుస్తూ 33 నుంచి 40 సంవత్సరాలు తమ జీవితమంతా సేవలందిస్తున్న ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు పెన్షన్ లేకపోవడం దుర్మార్గం. వారంలోపే సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరిస్తామని చెప్పి.. ఐదేళ్లు అధికారం పూర్తి చేసుకున్నారే కానీ సీపీఎస్ రద్దు చేయకపోవడం దగా. దీని స్థానంలో జీపీఎస్ అమలు చేయడం మరితం మోసం. పదవీవిరమణ అనంతరం భద్రత ఉండాలంటే పాత పింఛను విధానం చాలా అవసరం.

- మేకల శివార్జున, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

మామిడి రైతుకు ఊరట..

● ఆశాజనకంగా ధరలు ● రోజుకు 400 టన్నుల కాయల ఎగుమతి ● పండ్లకు డిమాండ్



కోతకు సిద్ధంగా బేనీషాలు



ఎగుమతి కోసం గోనె సంచుల్లో సిద్ధం చేసిన పచ్చడి కాయలు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 15: మామిడి కాయల ఎగుమతులు ప్రారంభమయ్యాయి. పచ్చడికి ఉపయోగించే రుమానీ, పులిహోర, తోతాపురి రకం కాయలను రోజుకు 400 టన్నుల దాకా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. దీంతో ధరలు భారీగా పెరిగాయి.

రైల్వేకోడూరు నియోజకవర్గంలో బేనీషా, నీలం, ఇమాంపసంద్, పులిహోరా, తోతాపురి, రుమాని, కాలేపాడు, నూనెపసంద్, రసాలు, మాల్గోవా, రెడ్డిపసంద్, మల్లికా, ఖాదర్ తదితర రకాల మామిడి కాయలను రైతులు పండిస్తున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున ఈ ఏడాది 20 శాతం మాత్రమే పంట ఉంది. దీంతో రైతులు, వ్యాపారులు కాయలను యార్డుకు తరలించకుండా నేరుగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. కాగా ప్రస్తుతం పండ్లుగా వినియోగించే బేనీషా టన్ను రూ. 60 నుంచి 70 వేలు, పులిహోర రకం టన్ను రూ. 50 నుంచి 55 వేలు, పచ్చడికి ఉపయోగించే తోతాపురి కాయలు టన్ను రూ. 35 నుంచి 40 వేలు, రుమానీ టన్ను రూ. 30 నుంచి 35 వేలు, పులిహోర టన్ను రూ. 25 నుంచి 28 వేలు పలుకుతున్నాయి. ఇమాం పసందు టన్ను రూ. 180 నుంచి 200 పలుకుతున్నాయి. పచ్చళ్లకు వినియోగించే కాయలు ప్రస్తుతం రాజ్‌కోట్, అహ్మదాబాద్, కాన్పూర్, బెనారస్, జైపూర్, రాజస్థాన్, ఉదయ్‌పూర్, బిల్వాడ తదితర ప్రాంతాలకు ప్రతి రోజు 20 లారీల్లో పంపిస్తున్నారు. ప్రస్తుతం కాయలతోపాటు, పండ్లకూ డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం పచ్చడి కాయల కోతలు ప్రారంభం కాగా, 15 రోజుల్లో పండ్లు కూడా పూర్తి స్థాయిలో కోతకు సిద్ధమయ్యే పరిస్థితి ఉందని రైతులు అంటున్నారు. తోటలను చీడపీడల నివారణకు రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడే పలువురు రైతులు ఈ సారి ఆర్గానిక్ మందులు ఎక్కువగా ఉపయోగించారు. తోటలకు సేంద్రియ ఎరువులు వేయడంతో కాయల రంగు, రుచి, వాసన బాగుంటుందని రైతులు చెబుతున్నారు. కాగా, ఎకరా తోటకు ఎరువులు, మందులు, కూలీలు తదితరాలకు రూ. 50 వేలు ఖర్చు చేశామనీ, ధరలు బాగుండడంతో ఈ ఏడాది ఆదాయం బాగా వస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మామిడి సీజన్‌లో సుమారు 2 వేల మంది కూలీలకు ఉపాధి కలుగుతుంది. సీజన్‌లో కర్నూలు, అనంతపురం, కడప, రాజంపేట, గుత్తి తదితర ప్రాంతాల నుంచి రైల్వేకోడూరు కు వచ్చి జీవనోపాధి పొందుతారు. సీజన్ లో కోట్లాది రూపాయల వ్యాపారం సాగుతుంది.



ఆదాయం బాగా వచ్చే అవకాశాలున్నాయి



ధర ఎక్కువగానే ఉండడంతో ఈ ఏడాది ఆదాయం వచ్చే అవకాశాలు ఉన్నాయి. వాతావరణ పరిస్థితుల ప్రభావంతో దిగుబడి తగ్గింది. ఉన్న పంటను పలు రకాలుగా కాపాడుకున్నాము. ప్రస్తుతం పచ్చళ్ల రకాలు ఎగుమతి చేస్తున్నాము.

- ఆర్. ఆదాం, రైతు

ఆర్గానిక్ మందులు పిచికారీ చేశాం



ఆర్గానిక్ మందులు పిచికారీ చేశాం. రసాయనిక మందులు వాడకం తగ్గించాం. ప్రస్తుతం పచ్చడి కాయలు కోస్తున్నాం. బేనీషా తదితర రకాలు మార్కెట్ లోకి రావాలంటే సుమారు 15 రోజులు పడుతుంది. ప్రస్తుతం ఆదాయం బాగానే ఉంది.

- వల్లయ్య, రైతు

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

● మృతుడు టీవీఎస్ షోరూం యజమాని ● నుజ్జునుజ్జైన కారు



నుజ్జునుజ్జయిన కారు (ఇన్‌సర్ట్) జయసుబ్బారెడ్డి (ఫైల్‌ఫొటో)

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 15 : టిప్పరు కారును ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చింతలచెరువుకు చెందిన అంబవరం జయసుబ్బారెడ్డి (48) బద్వేలు పట్టణంలోని మైదుకూరోడ్డులో టీవీఎస్ షోరూం నిర్వహిస్తుంటాడు. సోమవారం తన సతీమణి లక్ష్మీదేవితో కలసి కారులో ప్రొద్దుటూరుకు వెళ్లారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో అక్కడి నుంచి బద్వేలుకు తిరిగి వస్తుండగా నంది పల్లె సమీపంలోని డొడ్లడైరీ వద్ద ఎదురుగా వస్తున్న టిప్పరు, ఢీకొంది. దీంతో కారులో ఉన్న జయసుబ్బారెడ్డి ఆయన సతీమణి తీవ్రంగా గాయపడ్డారు. కారు నుజ్జునుజ్జు అయింది. విషయం గమనించిన స్థానికులు కారులో ఇరుక్కుపోయిన జయసుబ్బారెడ్డిని బయటికి తీసి 108 వాహనంలో కడప ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని స్థానిక బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వస్తున్నట్లు సమాచారం, తీవ్ర ంగా గాయపడిన లక్ష్మీదేవి కడపలోని ఓ ప్రైవేటు ఆసు పత్రికి తరలించారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి



బాలుడి మృతదేహం

ముద్దనూరు ఏప్రిల్15: విద్యుదాఘాతంతో ఓ బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కొలవలి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల సమాచారం మేరకు.. ..కొలవలి గ్రామానికి చెందిన నల్లబల్లె హరిప్రసాద్ (13) తన తండ్రి ఓబులేసు తో కలిసి చీనీ తోట వద్దకు వెళ్లాడు. తోట వద్ద వ్యవసాయ మోటర్‌కు సంబందించిన స్టార్టర్ తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.

అరటి తోట దగ్ధం..



దగ్ధమైన అరటి తోట

పులివెందుల టౌన్, ఏప్రిల్ 15: మండలంలోని ఇ.కొత్తపల్లెలో అరటి పంట దగ్ధం కావడంతో రూ. 4.50లక్షలు నష్టం వాటిల్లింది. వివరాలు ఇలా ఉన్నాయి. ముచ్చుకుంట్ల ఓబుల్‌రెడ్డి అనే రైతు 2.50 ఎకరాలలో అరటి పంట సాగుచేశారు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో అరటి పంటతో పాటు, డ్రిప్ పరికరాలు అగ్నికి ఆహుతైం దని బాధితుడు తెలిపాడు

స్థలం విషయంలో ఇరువర్గాల ఘర్షణ

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 15: మండలంలోని చిన్నఓరంపాడు దిగువపల్లెలో రెండు వర్గాలు ఘర్షణ పడి కత్తులతో దాడులు చేసుకున్నాయి. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గాలినరసింహులు, లక్ష్మీదేవి, వెలకచర్ల చెంగమ్మ, గాలి నాగేశ్వరి, గాలి బాలాజి, గాలి మణెమ్మ తమ ఇంటి ముందు ఉన్న స్థలం విషయంలో శివ, శంకరయ్య, నాగేంద్ర, జ్యోతితో సోమవారం ఘర్షణ పడ్డారు. ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు కత్తులతో దాడి చేసుకున్నారు. వీరిలో ఒక వర్గం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటుండగా, మరో వర్గం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాదరణతోనే కాంగ్రెస్ విజయం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 15:కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని, బద్వేలు నియోజవకర్గంలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. సోమవారం అయన పోరుమామిళ్లలోని అన్వర్ హాస్పిటల్ ఆవరణలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 9 పథకాలు అమలను చేస్తామన్నారు. కర్ణాటక లో ఐదు పథకాలతో అధికారం లోకి రాగా, తెలంగాణలో ఆరు పథకాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింద న్నారు. కాంగ్రెస్ అభ్యర్థి విజయజ్యోతి మాట్లాడుతూ రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ అవసరం చాలా ఉందని, నియోజకవర్గంలో తనను కడప పార్లమెంటు స్థానానికి షర్మిలారెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్సెస్ పార్టీ .జిల్లా మైనార్టీ జిల్లా అధ్యక్షుడు అన్వర్, సీపీఐ నాయకులు పిడుగు మస్తాన్, రవికుమార్, సీపీఎం నాయకులు భైరవ ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు శ్రీను పాల్గొన్నారు.

తపాలా ఏజెంట్లుగా చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

కడప (మారుతీనగర్) ఏప్రిల్ 15: తపాలా శాఖలో భాగమైన తపాలా జీవిత బీమా (పిఎల్ఐ), గ్రామీణ తపాలా జీవిత బీమా (ఆర్‌పిఎల్ఐ) ఏజెంట్లుగా కడప డివిజన్‌లోని పలు ప్రాంతాలలో పనిచేయుటకు నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కడప తపాల శాఖ సూపరింటెండెంట్ జి .రాజేష్ సూచించార ు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 29వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించనున్న వాక్ ఇన్ ఇంటర్వ్యూకు వారి తాలూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కడప వన్‌టౌన్ దగ్గర గల ప్రధాన తపాలా కార్యాలయంలో హాజరుకావాలని కోరారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే వారు పదవ తరగతి పాసై, 18 నుంచి 50 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలన్నారు. ఎంపికైనవారు 5 వేల రూపాయలను కేవీపీ, ఎన్ఎస్‌సీ బాండ్ల రూపంలో సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 08562-243013, 9490032695 అనే నెంబర్లను సంప్రదించాలన్నారు.

సేవల్లో నిర్లక్ష్యంపై శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు మెమో

ప్రొద్దుటూరు ఏప్రిల్ 15 : పారిశుధ్యం నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నాలుగు డివిజన్ల శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి సోమవారం మెమోలుజారీ చేశారు. సోమ వారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన క్లాప్ ఫ్లాప్ కథ నంపై ఆయన స్పందించారు. పట్టణంలో ప్రధాన రోడ్లపై చెత్త కుప్పలు సకాలంలో తరలించకపోవడం, శానిటరీ అధికారుల మధ్య సమన్వయం, సిబ్బందిపై నియంత్రణ లేకపోవడంపై సంజాయిషీ కోరుతూ ఆయన మెమోలు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కురబలకోట, ఏప్రిల్ 15: ద్విచక్రవాహనం అదుపు తప్పి ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని పిచ్చలవాండ్లపల్లె ముదివేడు బుర్రాచెరువుకొత్తపల్లెకు చెందిన మహేశ్వర్‌రెడ్డి(20) తన స్నేహితుడు వేణుతో కలిసి మినరల్ వాటర్ తెచ్చుకునేందుకు తన ద్విచక్రవాహనంలో ముదివేడుకు వెళ్ళాడు. అక్కడ వాటర్ క్యాన్‌ను తీసుకుని వస్తుండగా మార్గ మధ్యంలో వారి వాహనం అదుపు తప్పి కిందపడింది. దీంతో తీవ్రంగా గాయపడిన వారిని మదనపల్లె ప్రభు త్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ప్రమాదంలో వేణు చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై ముదివేడు పోలీసులు తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

తంబళ్లపల్లె, ఏప్రిల్ 15: అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి చెందింది. .కురబల కోట మండలం గొడ్డిన్నవారిపల్లెకు చెందిన మంజునాథ్‌కు ఒంటిమిట్టకు చెందిన సుజాతతో మూడేళ్ల క్రితం వివాహమైంది. ఆదివారం సాయంత్రం మంజునాథ్ గొడవ పడటంతో ఆమె ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు చుట్టుపక్కల గాలించగా సోమవారం ఉదయం తంబళ్లపల్లె మండలం కుక్కరాజుపల్లె సమీపంలోని కుమ్మరపల్లె వద్ద పొలాల్లో ఉరి వేసుకుని మృతి చెంది కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజా సమస్యలు పట్టించుకోరా?

● అర్జీలు స్వీకరించని తహసీల్దారు ● ప్రజా సంఘాల ఆగ్రహం



తహసీల్దారు కార్యాలయంలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్న అటెండర్

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 15: ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించని ప్రొద్దుటూరు తహసీల్దారు విద్యాసాగర్ వ్యవహార శైలిపై ప్రజా సంఘాలు తీవ్ర అభ్యంతాలు వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం తహసీల్దారు చాంబర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చాంబర్ అని, ఇందులోకి ఎవరినీ అనుమతించమని, ఆర్‌వో కార్యాలయానికి 100 మీటర్ల దూరం వరకు ఎవరినీ అనుమతించమని చెబుతున్నారు. దీంతో ప్రజాసంఘాల నేతలు సోమవారం తహసీల్దారు విద్యాసాగర్‌తో వాదనకు దిగారు. బీసీ బాలిక హాస్టల్ భవనం కూలడానికి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోకపోగా, ఆ విద్యార్థినుల సంక్షేమాన్ని పట్టించుకోకపోవడంపై తహసీల్దారుకు వినతి పత్రం సమర్పించేందుకు తహశీల్దారు కార్యాలయం వద్దకు వచ్చిన ప్రజా సంఘాలు, మహిళా సంఘాల నేతలను లోపలికి వెళ్ళడానికి అటెండర్ అడ్డుకున్నా. ఎలాగోలా లోనికి వెళ్లిన వారు సమస్య వివరిస్తుండగా, కలెక్టరుకు తామే నివేదిక పంపామని చెబుతూనే, ఇది ఆర్‌వో చాంబర్ అని ఇక్కడికి అందరు రాకూడదని గదమాయించారు. అనంతరం, తమకు రామేశ్వరం జగనన్న కాలనీల్లో పట్టా ఇచ్చారని, కానీ నేటికి అది ఎక్కడవుందో చూపించలేదని, . తమతో 35 వేలు డబ్బు కట్టించుకున్నారని, 20 వేలు లోన్‌కూడా తీసుకున్నారని కానీ, ఇంటినిర్మాణం గురించి చెప్పడంలేదంటూ ఫిర్యాదు చేసేందుకు ఓ వృద్ధ జంట కార్యాలయానికి వచ్చింది. వారిని కూడా అటెండర్ అడ్డుకున్నాడు. అక్కడే ఉన్న సీపీఐ నాయకులు రామయ్య, సుబ్బరాయుడు కాంగ్రెస్ నాయకుడు నజీర్‌లు వారిని విచారించారు. ఎందుకు లోపలికి అనుమతించరంటూ అటెండర్‌తో వాదించారు. అనంతరం వారు తహసీల్దారు విద్యాసాగర్‌ను కలిసి పరిస్థితి వివరించగా, ఇది ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంగా మారిందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బయట హెల్ప్‌డెస్కు పెట్టామని అక్కడ సంప్రదించాలని తహసీల్దారు తెలిపారు. దీంతో ప్రజల సమస్యలు తహసీల్దారు స్వీకరించవద్దని ఎన్నికల కమిషన్ తెలిపిందా అని నాయకులు వాదించడంతో, పార్టీ ప్రతినిధులుగా ఉన్న మీకు ఆ మాత్రం తెలియదా అనడంతోపాటు, ఈ అంశాలపై ప్రత్యేకంగా సెల్ ఏర్పాటు చేస్తామని తహసీల్దారు సమాధానమిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కోసం తహసీల్దారు కార్యాలయంలో ప్రత్యేక సెల్ ఏర్పాటుచేయాలని, లేకుంటే జిల్లా కలెక్టర్‌కు, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు.

బీసీ వెల్ఫేర్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

● తహసీల్దారుకు మహిళా, బీసీ, విద్యార్థి సంఘాల వినతి



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న బీసీ, మహిళా సంఘాల ప్రతినిధులు

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 15 : పాడుబడిన భవనాల్లో వసతి గృహాలు నిర్వహిస్తూ బీసీ బాలికల ప్రాణాలతో చెలగాటమాడిన బీసీ వెల్ఫేర్ అధికారులపై చర్యలు తీసుకోవాలని లేకుంటే ఆందోళన చేస్తామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు పాణ్యం సుబ్బరాయుడు, చైతన్య మహిళా సంఘం కన్వీనర్ పద్మ, విద్యార్థి శక్తి కన్వీనర్ హరిత, మహిళా శక్తి కన్వీనర్ వడ్ల లక్ష్మీదేవి హెచ్చరించారు. బీసీ వేల్ఫేర్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దారు విద్యాసాగర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడుబడిన ప్రైవేటు బిల్డింగ్‌లో దశాబ్దకాలంగా బీసీ బాలికల వసతి గృహం నిర్వహిస్తుండడం ప్రభుత్వం వివక్ష పాటించడమేనన్నారు. నాడు నేడులో భాగంగా జగన్ ప్రభుత్వం బీసీ బాలికల హాస్టల్ భవనాలు ఎందుకు నిర్మించలేదన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం సభ్యురాలు జింకా భాగ్యమ్మ, బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు మాడిశెట్టి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

లీజు పేరుతో సీఎస్ఐ స్థలం అన్యాక్రాంతం తగదు

కడప (కల్చరల్) ఏప్రిల్ 15. లీజు పేరుతో సీఎస్ఐ .హైస్కూల్‌లోని 61 సెంట్ల స్థలాన్ని 9 సంవత్సరాల కాలపరిమితికి గాయత్రి కన్‌స్ట్రక్షన్స్ ప్లానర్స్‌కు చెందిన వారికి బిషప్ ఐజాక్ వరప్రసాద్ రిజిస్ట్రేషన్ చేయించడం విడ్డూరంగా వుందని విశ్రాంత పాస్టర్ రెవరెండ్ ఐక్యతరావు, రెవరెండ్ జెకాస్ దేవసహాయం, రెవరెండ్ ప్రేమ్‌సాగర్, రెవరెండ్ ప్రభాకర్, రెవరెండ్ మైఖేల్‌బాబు, రెవరెండ్ బి.వి. మోహన్ అన్నారు. సోమవారం స్థానిక సీఎస్ఐ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. ముందుగా ఆ స్థలంలో నిర్మాణం పనులు చేయడానికి వీలుగా తవ్విన పునాదులను పరిశీలించార ు. అనంతరం మాట్లాడుతూ చర్చి ఆఫ్ సౌత్ ఇండియా సీఎస్ఐ) రాయలసీమ డయాసిస్, సీఎస్ఐ ట్రస్ట్ అసోసియేషన్ చెన్నై అనుబంధంతో ఉన్న ఆస్తులను లీజు పేరుతో ఇతరులకు ధారాదత్తం చే సే వీలులేదన్నారు. ఒకవేళ అలా ఇతరులకు లీజుకు ఇవ్వాలనే ఆలోచన వస్తే సంబందిత బిషప్‌తో పాటు ట్రెజరర్, సెక్రటరీలు ముందస్తు ప్రతిపాదన చేసి ఒక్క మాటగా చేయాల్సి ఉంటుందన్నారు.


అంతేగాని అదేదో బిషప్ స్వంత ఆస్తిలాగా ఆయన ఒక్క సంతకంతో గత 2023 జనవరి 17న కడప నగరపాలక సంస్థ నుంచి మార్టిగేషన్ తీసుకోవడం సరైందికాదన్నారు. ఆ సమయానికి బిషప్‌గా అతనికి హక్కులేదన్నారు. దీంతో కడప నగరపాలక సంస్థను కూడా బురిడీ కొట్టించారని ఆరోపించారు. కాబట్టి చట్టప్రకారంగా ఆయనపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో వై. కనకవల్లి, ఎం. ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న ముగ్గురు అరెస్టు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 15: మదనపల్లె ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని బి.కొత్తకోట మండలం తానామిట్ట చెక్‌పోస్టు వద్ద ఎస్ఈబీ సీఐ రమేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా బి.కొత్తకోట ఎస్సీ కాలనీకి చెందిన వెంకటరమణ కుమారుడు టి.గోవర్ధన్(27), ఎస్.వెంకటరమణ కుమారుడు ఎస్.నరసింహులు(38) ద్విచక్రవాహనంలో 74 ప్యాకెట్ల కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డారు. పోలీసులు ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసి ఇద్దరినీ అరెస్టు చేశారు. బి.కొత్తకోట పట్టణంలో సి.ఓబులేసు కుమారుడు సి. వెంకటేశ్(35) 115 ప్యాకెట్ల కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేశారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండుకు పంపామని సీఐ తెలిపారు.

పడకేసిన ఎస్సార్‌బీసీ పనులు

● కాలువ పనులు పూర్తయితే వేల ఎకరాలకు నీరు



కల్లుట్ల గ్రామ సమీపాన నిలిచిపోయిన శ్రీశైలం కుడి కాలువ నిర్మాణ పనులు

మైలవరం, ఏప్రిల్ 15: శ్రీశైలం కుడి కాలువ నుంచి కృష్ణా జలాలను మైలవరం జలాశయానికి తీసుకురావాలన్న కల నేటికీ నెరవేరడం లేదు. నంద్యాల జిల్లా అవుకు జలాశయం నుంచి మైలవరం జలాశయానికి నేరుగా కృష్ణా జలాలను తీసుకు వచ్చేందుకు 2006లో నిర్ణయం తీసుకున్నారు. అంతకు ముందే పేరుసోముల వరకు కాలువ నిర్మించారు. అక్కడి నుంచి మైలవరం జలాశయం వరకు దాదాపు 54 కి.మీ ఉంది. 5 జనవరి 2007లో పనులు ప్రారంభం అయ్యాయి. ఈ మేరకు 36, 37, 38 ప్యాకేజీల్లో రూ.135.49 కోట్లతో కాంట్రాక్టర్లతో ఒప్పందం జరగ్గా, పనులను 2009, జనవరిలోగా పూర్తి చేయాల్సి ఉంది. రూ.75 కోట్ల మేర పనులు పూర్తయిన అనంతరం కొన్ని కారణాలతో కాలువ పనులు నిలిచిపోయాయి. కాలువ పూర్తయితే అవుకు నుంచి మైలవరం జలాశయానికి నేరుగా నీటిని తరలించొచ్చు. గాలేరి నగరి కాలువ ద్వారా గండికోట జలాశయంలోకి నీరు చేరితే అక్కడి నుంచి మైలవరం జలాశయంలోకి నీటిని మళ్లించి నింపుతున్నారు. మూడు ప్యాకేజీల పనులు పూర్తయితే జమ్మలముగు నియోజకవర్గంలో సుమారు 40 వేల ఎకరాలకు లబ్ధి చేకూరుతుందని అధికారులు చెబుతున్నారు.

ఇప్పటి వరకు జరిగిన పనులు ఇలా..

● 36వ ప్యాకేజీలో నంద్యాల జిల్లా పెద్దముడియం మండలం కొండసుంకేసుల వరకు 12.77 కి.మీ ప్రధాన కాలువ, 40కి.మీ మేర ఉపకాలువ పనులు చేయాల్సి ఉంది. ఇందుకు రూ.38.72 కోట్లు కేటాయించగా, రూ.16 కోట్లు ఖర్చు చేశారు. ఇప్పటి వరకు 12.7 కి.మీ మేర మట్టి పనులు చేశారు. సిమెంట్ పూత పనులు మాత్రం కేవలం 2 కి.మీ చేశారు. ఈ ప్యాకేజీలో 13,500 ఎకరాలకు సాగునీరందించాల్సి ఉంది.

● 37 వ ప్యాకేజీ కింద పెద్దముడియం మండలం దిగువ కల్వటాల నుంచి మైలవరం మండలం ఎ.కంబాలదిన్నె వరకు 16.357 కి.మీ ప్రధాన, 20.45 కి.మీ ఉప కాలువలు నిర్మించాల్సి ఉంది. ఇంతవరకు భూసేకరణ జరగలేదు. ఈ ప్యాకేజీకి రూ.48.40 కోట్లు కేటాయించగా, రూ.27 కోట్లు ఖర్చు చేశారు.

● 38వ ప్యాకేజీ కింద మైలవరం మండలం ఎ.కంబాలదిన్నె నుంచి మైలవరం జలాశయం వరకు 24.41 కి.మీ ప్రధాన కాలువ, 15 కి.మీ మేర ఉపకాలువలు నిర్మించాల్సి ఉంది. భూసేకరణ జరగకపోవడంతో ఒప్పందం ప్రకారం 2009 జనవరి 21వ తేది నాటికి పనులు పూర్తి కాలేదు. దీంతో మరో ఏడాది పాటు గడువు పొడిగించారు. అయినా కాంట్రాక్టర్లు పనులు చేయలేక చేతులెత్తేయడంతో శ్రీశైలం కుడి కాలువ పనులు అర్థంతరంగా నిలిచిపోయాయి. 2011 ఫిబ్రవరి 14న ఎస్సార్‌బీసీ ఇంజనీర్ల బృందం మైలవరం మండలం బెస్తవేముల ప్రాంతంలో భూసేకరణ కోసం సర్వే నిర్వహించినా ఎలాంటి పురోగతి కనిపించలేదు. ఇప్పటికైనా ఎస్సార్‌బీసీ పనులు పూర్తయ్యేవిధంగా ప్రభుత్వాలు, అధికారులు చొరవ చూపాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా 'సూపర్ సిక్స్'

మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజల్లో ఉత్సాహం కనిపిస్తోందని ఆ పార్టీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి పేర్కొన్నారు. చంద్రబాబు విజన్ ఉన్న అరుదైన నేత అని పలువురు కొనియాడుతున్నారన్నారు. ఆయన సీఎం అయితే రాష్ట్రానికి పసిడి భవిష్యత్తు తథ్యమని, లేకుంటే సగటు జీవి మనుగడ, పిల్లల భవిష్యత్తు అంధకారం అవుతుందని స్పష్టం చేస్తున్నారన్నారు. కడప నగరంలో ఎటు వెళ్లినా సైకిల్ గుర్తుకు ఓటేసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారన్నారు.




మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను అందిస్తున్న కడప టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి... ప్రజలకు అభివాదం చేస్తున్న మాధవీరెడ్డి

- చంద్రబాబునాయుడిపై పెల్లుబుకుతున్న ప్రజాభిమానం
- ముస్లిం మైనార్టీలకు అండగా తెలుగుదేశం పార్టీ
- టీడీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి రెడ్డప్పగారి మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 15 : చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలు ప్రజల్లో నాటుకుపోయాయని టీడీపీ కడప ఎమ్మెల్యే అ భ్యర్థి ఆర్.మాధవీరెడ్డి తెలిపారు. ముస్లిం మైనార్టీలకు టీడీపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కడప నగరం 45వ డివిజన్‌లో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ ఆధ్వర్యంలో చెమ్ముమియ్యాపేట రామాలయం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలు ప్రజలహృదయాల్లో నాటుకుపోయాయన్నారు. 18 ఏళ్లు నిండిన ఆడబిడ్డకు నెలకు రూ.1500 ఆర్థికసాయం చేస్తారని చెప్పారు. తల్లికి వందనం పథకం కింద ఇంట్లో ఎందరు పిల్లలు ఉన్నా చదువుకునే ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.15వేలు ఇస్తారన్నారు. ప్రతి కుటుంబానికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్‌సిలిండర్లు, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికీ సురక్షి తాగునీరు, ప్రతి రైతుకు ఏటా రూ.20వేల ఆర్థికసాయం అందిస్తారన్నారు. ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3వేలు నిరుద్యోగభృతి కల్పిస్తారన్నారు. బీసీల రక్షణకు ప్రత్యేక చట్టం, రాబోయే ఐదేళ్లలో యువతకు 20లక్షల ఉద్యోగాల కల్పన వంటి గొప్ప పథకాలతో ప్రజాభిమానం టీడీపీ వైపు కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని వివరించారు.

మైనార్టీలకు అండగా టీడీపీ

టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మైనార్టీలకు అండగా ఉంటుందన్నారు. జిల్లాలో మైనార్టీలకు సంబంధించి పలు అభివృద్ధి పనులు చేస్తారన్నారు. కడప నగరంలో నిరుపయోగంగా ఉన్న హజ్‌హౌస్‌ను పునరుద్ధరించి పూర్వవైభవం తీసుకువస్తామని తెలిపారు. అక్కడే అన్ని వసతులతో నూతన షాదిఖానాతో పాటు అందరూ సేదదీరేలా కొత్త పార్కులను నిర్మిస్తామని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో షహమీరియా బ్రిడ్జి, లా కాలేజీ బ్రిడ్జి నిర్మించి ప్రయాణాలకు మార్గం సుగమం చేస్తామని చెప్పారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అవసరమైన ప్రదేశాలను గుర్తించి కొత్తరోడ్లు, బ్రిడ్జిలు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ముస్లిం మత పెద్దలు ఇమాంలు, మౌజన్లకు మసీదు కమిటీ సభ్యులకు సొంత ఖర్చులతో రూ.10లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తామని, ముస్లిం మత పెద్దలకు కుటుంబ సభ్యుడిగా చేదోడువాదోడుగా చంద్రబాబు ఉంటారన్నారు. పేద, మధ్యతరగతి ముస్లిం సోదరీమణులు వారి కాళ్లమీద వారు నిలబడే విధంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. అర్హులైన ముస్లిం మహిళలకు కుట్టుమిషన్లు అందించి, శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. ఆర్థిక సమస్యలతో చదువుకు దూరమవుతున్న పిల్లలను గుర్తించి విద్యావకాశాలు కల్పిస్తామన్నారు. పెరుగుతున్న జనాభా దృష్ట్యా ముస్లిం సోదరులకు మసీదుల్లో సౌకర్యాలను మెరుగుపరుస్తామన్నారు. వక్ఫ్‌బోర్డు సమన్వయంతో స్థానికంగా అవసరమైన కొత్త నిర్మాణాలు, సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. కబ్జాకు గురవుతున్న వక్ఫ్‌బోర్డు భూములను పరిరక్షిస్తామన్నారు. నకాశ్ బరియల గ్రౌండ్ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నకాశ్ బరియల్ గ్రౌండులో డ్రైనేజీ రాకుండా కొత్త కాల్వలు నిర్మించి గ్రౌండులో మురుగునీరు రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

యువత పెడదోవ పట్టకుండా చర్యలు

యువతను పెడదోవ పట్టించే చెడు వ్యసనాలను అరికడతామని, గంజాయి లాంటి మాదక ద్రవ్యాలబారిన పడకుండా కాపాడుకుంటామన్నారు. పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టి డ్రగ్స్ అనే మాట వినబడకుండా అసాంఘిక శక్తులను అణచివేసి యువతకు ఉపాధిమార్గాలు చూపెడతామన్నారు. రవీంద్ర నగర్ లా కాలేజీ రహదారి విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు పునరావాసం సకల్పిస్తామని, అధికారంలోకి వచ్చిన వెంటనే నిర్వాసితులకు శాశ్వత నివాసం కల్పించి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. డ్వాక్రా రుణమాఫీ, పసుపు కుంకుమ ద్వారా చంద్రన్న పాలనలో కోటిమంది మహిళలు ఒక్కొక్కరు సమానంగా రూ.20వేలు లబ్ధి పొందారని, అయితే జగన్‌రెడ్డి పాలనలో ఒక్కో మహిళ పొందిన లబ్ధి రూ.15వేలకు తగ్గిందన్నారు. ఈ రకం 50 లక్షల మంది డ్వాక్రా మహిళలకు జగన్‌రెడ్డి టోకరా వేశారన్నారు. రాష్ట్రంలో కోటి 14 లక్షల మంది డ్వాక్రా మహిళలు ఉంటే 79 లక్షలకే వారిని కుదించారన్నారు. మద్యంరేట్లు మూడురెట్లు పెంచి 2 లక్షల విలువ గల నాశిరకం మద్యం అమ్మారని, భార్యాబిడ్డలు తినాల్సిన మందుబాబుల కష్టార్జితాన్ని మద్యం ద్వారా జగన్‌రెడ్డి దోచుకుతింటున్నారన్నారు. నాశిరకం మద్యంతో 35 లక్షల మంది ఆరోగ్యాలు నాశనం చేసిన ఘనత జగనరెడ్డికే దక్కిందన్నారు. అందులో 30వేల మంది అకాల మృత్యువాత పడ్డారన్నారు. నాశిరకం మద్యం ద్వారా మహిళల మాంగల్యాలు మంట గల్పుతున్న ఘనత జగనరెడ్డికే దక్కిందన్నారు.



కడప నగరం సాయిపేటలో ఎన్నికల ప్రచారంలో మాధవీరెడ్డి

జగన్ పాలనలో ఒరిగిందేమిటి?

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనతో రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదని మాధవీరెడ్డి పేర్కొన్నారు. ప్రతి వస్తువుపై ధర పెంచి ఒక్కో కుటుంబంపై తన ఐదేళ్ల పాలనలో లక్షల భారం మోపారని ఆరోపించారు. చంద్రన్న పాలనలో సున్నా వడ్డీ ఐదు లక్షలకు వర్తింపజేస్తే జగన్‌రెడ్డి 3 లక్షలకు కోత పెట్టి మోసం చేశారన్నారు. ఆ మూడు లక్షలు కూడా సున్నా వడ్డీ కేంద్రమే భరిస్తుందని, అది జగన్ ఇచ్చింది కాదన్నారు. ఉచితంగా ఇళ్లు ఇస్తామని నమ్మించి మాట తప్పి ఓటీఎస్ పేరుతో ఒక్కో మహిళ నుంచి 10వేల నుంచి 30వేలు బలవంతంగా వసూలు చేశారన్నారు. ఇళ్లనిర్మాణం పేరుతో జగన్ అప్పులపాలు చేశారన్నారు. టీడీపీ హయంలో కట్టించిన టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఇవ్వలేదన్నారు. చంద్రన్న అధికారంలోకి వచ్చి ఉంటే మొదటి ఏడాది నుంచే 3వేల పించను ఇచ్చి ఉండేవారని, వాయిదాల వల్ల ఒక్కో అవ్వ తాత రూ.30వేలు నష్టపోయారన్నారు. అలాగే వైసీపీ ప్రభుత్వంలో పెళ్లి కానుక రద్దు చేయడం వల్ల కఠిన నిబంధనల వల్ల పేదింటి ఆడపిల్లలకు తీరని నష్టం వాటిల్లిందన్నారు. అంగన్వాడీ జీతాలు టీడీపీ ప్రభుత్వంలో రూ.6300కు పెంచగా జగన్ సీఎం అయ్యాక కేవలం వెయ్యి మాత్రమే పెంచి మోసం చేశారన్నారు.

జగనన్న పాలనలో ఆడపడుచులకూ మోసం

జగనన్న పాలనలో ఆడపడుచులకూ మోసం చేశారని మాధవీరెడ్డి ధ్వజమెత్తారు. 2014 ఏప్రిల్ 1 నాటికి డ్వాక్రా సంఘాల ఎన్‌పీఏలు 10.33 శాతం ఉండగా, 2019 ఏప్రిల్ 1 నాటికి 1.56 శాతానికి తగ్గించిన ఘనత చంద్రబాబుదేనని, అయితే జగన్‌రెడ్డి 18 శాతం అంటూ నిస్సిగ్గుగా పేర్కొనడం దారుణమన్నారు.

మహిళలపై పెరిగిన నేరాలు

వైఎస్ జగన్ పాలనలో మహిళలపై నేరాలు పెరిగాయని కడప ఎమ్మెల్యే అభ్యర్థి పేర్కొన్నారు. ఎన్‌సీఆర్‌బీ ప్రకారం 2022లోనే మహిళలపై 25,503 నేరాలు, 601 అత్యాచారాలు, 180 అత్యాచారయత్నం ఘటనలు వెలుగు చూశాయన్నారు. జాతీయ స్థాయిలో మహిళలపై నేరాల రేటు 66.4 కాగా ఏపీలో మాత్రం 96.2శాతం నమోదు కావడం మహిళాభద్రతలో జగన్‌రెడ్డి డొల్లతనాన్ని తెలియజేస్తుందన్నారు. వైసీపీ పాలనలో 30196 మంది మహిళలు, చిన్నారులు మిస్ అయ్యారన్నారు. 2019తో పోలిస్తే 2021 మహిళల అదృశ్య ఘటనలు 43.45 శాతం, చిన్నారుల అదృశ్యం ఘటనలు 53.61 శాతానికి పెరిగాయన్నారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో మహిళలపై 2లక్షలకు పైగా నేరాలు నమోదయ్యాయని, దేశవ్యాప్తంగా మహిళలపై జరిగే నేరాల్లో మూడోవంతు ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్నాయన్నారు. టీడీపీ నాయకులు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఆకుకూరల మాదిరిగా గంజాయి

- మహిళలు సురక్షితంగా ఇంటికి వెళ్లలేని పరిస్థితి
- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 15 : జిల్లాలో గంజాయి ఆకుకూరల మాదిరిగా తయారైందని టీడీపీ కడప ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి తెలిపారు. గంజాయి తోటకూర, మెంతికూర, మునగాకు మాదిరిగా జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి దొరుకుతుందన్నారు. మహిళలు సురక్షితంగా ఇంటికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కడప నగరం ద్వారకానగర్ తన కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ కడపలో హౌసింగ్‌బోర్డు కాలనీలో ఓ పార్టీ కార్యాలయం ఎదుట కన్‌స్ట్రక్షన్ బిల్డింగులో ఆరుగురు బ్యాచ్ గంజాయి సేవిస్తూ దొరికిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే వారు యువతులను తీవ్రంగా ఈవ్‌టీజింగ్ చేశారన్నారు. గంజాయి బ్యాచ్‌కు తట్టుకోలేక యువతులు పోలీసులకు ఫోను చేయగా పోలీసులు వచ్చి గంజాయి బ్యాచ్‌ను అదుపులోకి తీసుకున్నారని, వారిలో కీలక వ్యక్తిని పట్టుకోలేకపోయారని చెప్పారు. పోలీసులు తమదైన శైలిలో వారిని విచారిస్తే ఈ గంజాయి డాన్ ఎస్ అనే అక్షరంతో ప్రారంభమవుతుందన్నారు. అయితే ఈఎస్ అనే వ్యక్తిని కాపాడేందుకు ఓ కార్పొరేటరు తన కార్యాలయంలోనే ఉంచుకున్నట్లు తెలిసిందన్నారు. వైసీపీ కార్పొరేటరు కార్యాలయంలో పోలీసులు సోదాలు చేయగా ఆ కార్పొరేటరును కాపాడేందుకు పులివెందుల పెద్దలు అండదండలు పుష్కలంగా ఉన్నాయన్నారు. నేడు కడపలో మహిళలు స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. గడిచిన మూడు సంవత్సరాలుగా ఆకుకూరలు అమ్మినట్లు గంజాయిని అమ్ముతున్నారన్నారు. కోడికత్తి డ్రామా ముగియకముందే గులకరాళ్ల డ్రామా మొదలుపెట్టారని దీన్ని ప్రజలు తిప్పికొట్టారన్నారు. ఇటువంటి ప్రయత్నాలు చేసి టీడీపీకి అంటించేందుకు చూస్తున్నారన్నారు. నిజంగా దాడి జరిగి ఉంటే నిజంగా పోలీసుల వైఫల్యంగా భావించవచ్చన్నారు. డీజీపీ, సీపీలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు. కోడికత్తి శ్రీను అన్యాయంగా ఐదు సంవత్సరాలు జైల్లోనే గడపాల్సి వచ్చిందన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో సానుభూతి సాధించేందుకే జగన్‌రెడ్డి గులకరాళ్ల డ్రామా ప్రారంభించారన్నారు. ఓడిపోతామనే భయంతో సీఎం జగన్ ఈ కొత్త డ్రామాకు తెర లేపారన్నారు. సీఎం జగన్ చేపట్టిన బస్సు యాత్ర పూర్తి విఫలమైందని, ప్రజల స్పందన కరువయిందన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో గంగవరం శేఖర్‌రెడ్డి, తిరుమలేష, గురప్ప, శివారెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం: ఆర్డీఓ

పులివెందుల రూరల్, ఏప్రిల్ 15: పులివెందుల నియోజకవర్గం పరిధిలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు పులివెందుల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ వెంకటేశులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఎన్నికల విధివిధానాలు, ఏర్పాట్లను విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. ఈనెల 18వ తేదీ నుంచి అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణ మొదలవుతుందన్నారు. సీజిజకరణకు చివరి తేది 25, పరిశీలన 26వ తేదీ, నామినేషన్ల ఉపసంహరణ తేది 29వ తేదీ మధ్యాహ్నం 3గంటలవరకు ఉంటుందన్నారు. అలాగే ఎన్నికల పోలింగ్ తేది మే 13, కౌంటింగ్ జూన్ 4వ తేదీ ఉంటుందన్నారు. కార్యాలయంలో అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించేందుకు బృందంతో పాటు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.





వైసీపీ నుంచి 100 కుటుంబాలు టీడీపీలో చేరిక


కమలాపురం రూరల్, ఏప్రిల్ 3: కమలాపురం నగర, పంచాయతీ పరిధిలోని పడమర గండ్లూరు కాలనీ, బీడీకాలనీల్లో వైసీపీ నుంచి 100కుటుంబాలు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో 13వ వార్డు కౌన్సిలర్ బాబుల్ ఎన్టీఆర్ రమణ ఆధ్వర్యంలో వైసీపీ నుంచి వంద కుటుంబాలవారు టీడీపీలో చేరారు. వారందరికీ పుత్తా నరసింహారెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ నిరంకుశ పాలన నచ్చకనే యువత టీడీపీలో చేరుతున్నారన్నారు. రాబోవు కాలంలో యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఖాదర్‌బాషా, దివాకర్‌రెడ్డి, కంకర సుబ్బారెడ్డి, రెడ్డి, కరీం, వాసుదేవరెడ్డి, రాఘవరెడ్డి, చిన్నక్రిష్ణారెడ్డి, దాదిరామయ్య, ఎన్టీఆర్ రమణ, శంకర్‌యాదవ్, చెన్నక్రిష్ణారెడ్డి, సూర్యసుబ్బారెడ్డి పాల్గొన్నారు.



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

కాపు, బలిజ సంక్షేమ సేన ఉమ్మడి జిల్లాల కో ఆర్డినేటరుగా బీవీ రమణ

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 15 : కాపు బలిజ సంక్షేమ సేన ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటరుగా బీవీ రమణ నియమితులయ్యారు. వీరితో పాటు కడప జిల్లా అధ్యక్షుడిగా పోలుదాసు శ్రీనివాసులు, జిల్లా వైస్ ప్రెసిడెంటుగా తమ్మిశెట్టి చలపతి బాధ్యతలు స్వీకరించారు.సోమవారం పాలకొల్లులో కాపు బలిజల సంక్షేమ సేన రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమితి సమావేశం జరిగింది. ఆ సమావేశంలో వీరి నియామకం జరిగింది. ఆ సమావేశంలో ఆ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు హరిరామ జోగయ్య వీరికి నియామక పత్రాలు ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యంగా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ) అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు.



టీడీపీ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

- భవిష్యత్తు గ్యారంటీలో యువనేత పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి



భవిష్యత్తు గ్యారంటీలో పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

చెన్నూరు, ఏప్రిల్ 15 :తెలుగుదేశం పార్టీ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని శివాలపల్లె, కొక్కిరాయపల్లెల్లో బాబుతోనే భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనకు చరమగీతం పాడినప్పుడే ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. యువనేత పుత్తా లక్ష్మీరెడ్డి, మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి, బ లిజ సంఘం జిల్లా నాయకులు ఆకుల ప్రసాద్‌బాబు, శివాలపల్లె టీడీపీ సీనియర్ నాయకులు పర్వతరెడ్డి, గ్రామ పెద్దలు లక్ష్మీకరరెడ్డి, సుంకేసుల శ్రీనివాసులు, ఎస్.శ్రీనివాసులు, రాంప్రసాద్ పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో జోరుగా టీడీపీ ఎన్నికల ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న బీటెక్ రవి

సింహాద్రిపురం, ఏప్రిల్ 15: సింహాంద్రిపురం మండలంలో టీడీపీ ఎన్నికల ప్రచారం సోమవారం జోరుగా సాగింది. పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి(బీటెక్ రవి)సోమవారం ఉదయం భానుకోట పార్వతీ సమేత సోమేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండలంలోని అహోబిళం, రావులకొలను, సుంకేసుల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. సుంకేసుల గ్రామానికి చెందిన పల్లేటి నరసింహారెడ్డి, కొం డేటి వెంకటనాథరెడ్డిలతో పాటు పలు కుటుంబాలవారు టీడీపీలో చేరారు.

'నవ్యాంధ్రను మద్యాంధ్రగా మార్చిన జగన్'

కమలాపురం రూరల్, ఏప్రిల్ 15:నవ్యాంధ్రప్రదేశ్‌ను మద్య ఆంధ్రప్రదేశ్‌గా వైఎస్ జగన్ మార్చారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సతీమణి సరళమ్మ అన్నారు. సోమవారం నగర పంచాయతీ పరిధిలోని 6,7,8, 910 వార్డుల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి సతీమణి శ్రీచైతన్యరెడ్డి, పుత్తా జ్యోతిరెడ్డి సతీమణితో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

పులివెందులలో టీడీపీకి అవకాశం ఇవ్వండి

వేముల, ఏప్రిల్ 15: పులివెందులలో తెలుగుదేశం పార్టీని గెలిపించి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పార్థసారధిరెడ్డి, బీటెక్ రవి సోదరుడు మారెడ్డి జోగిరెడ్డి, డీఎన్‌రెడ్డి మనువడు డాక్టర్ చైతన్యరెడ్డిలు ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం మండలంలోని గొల్లలగూడూరులో ఆ గ్రామ నాయకులు రవి, భాస్కర్‌రెడ్డి, రామాంజనేయులరెడ్డి ప్రచారం నిర్వహించారు.

పేదలకు సాంకేతిక విద్య శివానందరెడ్డి ఆశయం

- ఘనంగా 75వ జయంతి వేడుకలు



శివానందరెడ్డికి నివాళులర్పిస్తున్న భార్య రాజేశ్వరమ్మ, కుమారులు నాని, మదన్

సీకేదిన్నె, ఏప్రిల్ 15: పేద, మధ్యతరగతి ప్రజలకు సాంకేతిక విద్యను అందించాలని కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ కందుల శివానందరెడ్డి అని కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి తెలిపారు. కందుల విద్యాసంస్థల అధినేత, మాజీ శాసనసభ్యుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త స్వర్గీయ కందుల శివానందరెడ్డి 75వ జయంతిని సోమవారం కుటుంబ సభ్యులు కళాశాల సిబ్బంది, బంధువుల మధ్య ఆయన విగ్రహానికి కేఎస్ఎన్‌ఆర్ ఘాట్‌లో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1980 సంవత్సరంలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేసి వేల మంది విద్యార్థులకు సాంకేతిక విద్య ను అందించడంతోపాటు వారికి ఉన్నత అవకాశాలు కల్పించిన ఘనత శివానందరెడ్డికే దక్కుతుందన్నారు. నిరంతరం కృషి చేసి ఆయన ఆశయాన్ని నెరవేర్చుతామన్నారు. కరస్పాండెంట్, ట్రెజరర్ కందుల రాజేశ్వరమ్మ మాట్లాడుతూ శివానందరెడ్డి ఆశయాలను నెరవేర్చడంలో కుమారులు చంద్ర ఓబుళరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని, ఆయన ఆశయాలను ఒక్కొకక్కటిగా అమలు చేస్తున్నారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి, వైస్‌ప్రిన్సిపాల్ నాగేశ్వరప్రసాద్, కేఎల్‌ఎం ప్రిన్సిపాల్ ఎంవీ రత్నమ్మ, కేఓఆర్‌ఎం కళాశాల సెక్రటర్ లిఖితారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.


దస్తగిరివి నిరాధార ఆరోపణలు : చైతన్యరెడ్డి

కడప (మారుతీనగర్), ఏప్రిల్ 15: కాంగ్రెస్ పార్టీ కడప మాజీ ఎంపీ వైఎస్ వివేకానందరెడ్డి హత్య విషయంగా నెలరోజులుగా తనతో పాటు ప్రస్తుత వైసీపీ కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డిపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని వివేకా హత్య కేసులో ఏ-5 దేవిరెడ్డి శంకర్‌రెడ్డి కుమారుడు డాక్టర్ దేవిరెడ్డి చైతన్యరెడ్డి పేర్కొన్నారు. పై పెచ్చు వివేకానందరెడ్డి హత్య తదనంతరం అప్రూవర్‌గా మారిన దస్తగిరి సీబీఐకి ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో పచ్చి అబద్ధాలున్నాయని అన్నారు. ఆ మేరకు సోమవారం కడప ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దస్తగిరి అప్రూవర్‌గా మారిన వ్యవహారంలో సైతం పెద్దకుట్ర దాగి ఉందన్నారు.

టీడీపీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు న్యాయం

పెండ్లిమర్రి, ఏప్రిల్ 15: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నందిమండలం పం చాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి వస్తే అ మలు చేసే పథకాలను వివరించారు. మయూర్‌రెడ్డి, జయరాం, బ్రహ్మం, ఆంజనేయులు, అమర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంటాను మర్యాదపూర్వకంగా కలిసిన దుర్గాప్రసాద్



కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 15 : ఇటీవల టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన కడప ప్రముఖ పారిశ్రామిక వేత్త సుధా దుర్గాప్రసాద్, రాష్ట్ర కార్యదర్శిగా నియామకం అయిన అనంతరం భీమిలిలో మాజీమంత్రి గంటా శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి ప్రస్తుత రాజకీయాలపై చర్చించారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన జాతీయ అధ్యక్షులు చంద్రబాబు, జాతీయకార్యదర్శి లోకేశ్‌కు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డికి .ధన్యవాదాలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో క్రియాశీలకంగా పనిచేసి సమిష్టిగా కడప జిల్లాలో పార్టీని గెలిపించుకుని వస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ఓటు హక్కు వినియోగించుకోండి

● పోలీసు బలగాలతో కవాతు

జమ్మలమడుగు, ఏప్రిల్ 15: జమ్మలమడుగు పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం కేంద్ర సాయుధ బలగాలతో డీఎస్పీ యశ్వంత్, అర్బన్ సీఐ కరుణాకర్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. పోలీసులు జమ్మలమడుగు పట్టణంలో కవాతు నిర్వహించి ప్రజల్లో భరోసా కల్పించారు.

పోలీసు కవాతు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 15 : రానున్న ఎన్నికల సందర్భంగా మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ చిరంజీవి తెలిపారు. అక్కలరెడ్డిపల్లె, కవలకుంట్ల, టేకూరుపేట, పోరుమామిళ్ల ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికలు ఎంతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు.

కుర్చీల వితరణ

మైలవరం, ఏప్రిల్ 15: మైలవరం మండల విద్యాశాఖాధికారి కార్యాలయానికి సోమవారం దాల్మియా భారత్ ఫౌండేషన్ సీఎస్ఆర్ కో-ఆర్డినేటర్ రామరాజు 50 కుర్చీలను వితరణ ఇచ్చినట్లు ఎంఈవో చిట్టిబాబు తెలిపారు. మండల కార్యాలయంలో జరిగే మండల మీటింగ్స్, ట్రైనింగ్స్ తదితర వసతులకు ఉపాధ్యాయులకు ఇబ్బందులు లేకుండా కుర్చీలను వితరణగా ఇచ్చినట్లు ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో దాల్మియా సీఎస్ఆర్ సిబ్బంది శ్రీనివాసులు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది మురళి, సీఆర్పీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

పోరుమామిళ్ల, ఏప్రిల్ 15 : రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలంటే కాంగ్రెస్ పార్టీఅధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని బద్వేలు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్‌డీ విజయజ్యోతి అన్నారు. సోమవారం బెస్తవీధి, మెయిన్‌బజారు, కొలిమివీధి తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు భైరవ ప్రసాద్, పిడుగు మస్తాన్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కీటక జనిత వ్యాధులపై అవగాహన

పోరుమామిళ్ల, ఏప్రిల్ 15 : మండలంలోని టేకూరుపేట ఆరోగ్య కేంద్రం పరిధిలోని పోరుమామిళ్ల నాలుగో సచివాలయ పరిధిలోని శివరామనందనగర్‌లో ఆశా కార్యకర్తల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించి ఫీవర్, లార్వా సర్వే చేసినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం జాతీయ కీటకజనిత వ్యాధులపై వైద్యసిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే డ్రైనేజీ కాల్వల్లో పూడిక తీత పనులను తొలగింపజేశారు.

తాగునీరు సమస్య తలెత్తకూడదు

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 15 : వేసవిలో తాగునీరు సమస్య రాకూడదని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల సర్వసభ్య సమావేశం సభా భవనంలో ఎంపీడీవో మల్లేశ్వరప్ప అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీపీ సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతూ వేసవి కాలం గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యలు రాకూడదన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టండి'

కడప టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి

కొండాపురం, ఏప్రిల్ 15 : రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని కడప టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి తెలిపారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థిగా తన బాబాయి ఆదినారాయణ రెడ్డిని, కడప ఎంపీ అభ్యర్థిగా తనను భారీ మెజార్టీతో గెలిపించాలని మండల బీజేపీ ఇన్‌చార్జి దేవగుడి శివనారాయణ రెడ్డితో కలిసి మండలంలోని టి.కోడూరు గ్రామంలో సోమవారం ఆయన ఇంటింటికి ప్రచారం నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కోడూ రు ఎంపీటీసీ రామమునిరెడ్డి, రెడ్డి రామసుబ్బారెడ్డి, సత్యనారాయణ రెడ్డి,సుధాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, రమణారెడ్డి,నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కళా జాగృతి

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 15 : ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్, వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీసు కళాజాగృతి అలరించింది. స్థానికంగా జరిగిన కనువిప్పు నాటిక ఎంతో ఆకట్టుకుంది. ఇందులో భాగంగా ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా కేసులు పరిష్కరించుకోవాలని డీఎస్పీ మురళీధర్ తెలిపారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేటట్లు చూడాలని, గొడవల జోలికి వెళ్లకూడదని చెప్పారు. స్థానిక కళాకారులు ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడుదాం

వైసీపీ నుంచి టీడీపీలోకి కొనసాగుతున్న వలసల పరంపర





మైదుకూరు, ప్రొద్దుటూరు, కొండాపురంలో వైసీపీ నేతలను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న పుట్టా సుధాకర్ యాదవ్, వరదరాజులరెడ్డి, భూపేశ్‌రెడ్డి

ఖాజీపేట, ఏప్రిల్ 15: రాష్ట్రంలో వైసీపీ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని కడప ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి, మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మిడుతూరు గ్రామంలో వెన్నపూస ఓబుళరెడ్డి, వెంకటరమణారెడ్డి, మౌలాల్‌రెడ్డి, వీరారెడ్డి, అనుచర వర్గం మండల అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మీరెడ్డి, శ్రీరాములుయాదవ్ ఆధ్వర్యంలో పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో దాదాపు 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఇంటింటి ప్రచారంలో భాగంగా ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి సుధాకర్‌యాదవ్ పాల్గొని సూపర్-6 పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, నాగసుబ్బారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, నాగలక్షుమ్మ, రామకృష్ణారెడ్డి, నాయకులు మురళీధర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నాగశివారెడ్డి, వీరయ్య, సుబ్బయ్య, రామానాయుడు, ఆదినారాయణరెడ్డి, గంగిరెడ్డి, వెంకటరామిరెడ్డి, రాము, రమణ, అంకాల్ పాల్గొన్నారు.

మైదుకూరు..: టీడీపీకి ఓట్లేసి గెలిపించాలని అధికారం చేపట్టిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ ఇంటింటికి తిరుగుతూ ఓటర్లకు కరపత్రాలు అందించారు. పట్టణంలోని 8వ వార్డులో సోమవారం నాయకులతో కలసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. కాగా వార్డులోని నాయకులు పుట్టా సుధాకర్‌యాదవ్‌కు బ్రహ్మరథం పట్టారు.

పలువురు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక..: స్థానిక 8, 14 వార్డులలోని వైసీపీ నాయకులను టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ పార్టీలో చేర్చుకున్నారు. దండు వెంకట సుబ్బయ్య, రమణయ్య, సుధాకర్, రామచంద్రుడు, అబ్దుల్ తదితరులకు చెందిన దాదాపు 100 కుటుం బాల వారిని టీడీపీలోకి చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, బీజేపీ కన్వీనరు మాచనూరు సుబ్బరాయుడు, జనసేన కన్వీనరు మల్లోత్ర కూటమికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

కొండాపురం..: మండలంలోని చామలూరు వైసీపీ సర్పంచ్ రాఘవేంద్రా రెడ్డి సహా సుమారు 50 కుటుంబాలు సోమవారం టీడీపీలో చేరారు. టీడీపీ కడప ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి సమక్షంలో వారు టీడీపీ కండువాలు కప్పుకున్నారు. రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి,కడప ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి గెలుపే ధ్యేయంగా పనిచేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోడూరు ఎంపిటిసి రామమునిరెడ్డి,టీడీపీ,బీజేపి నాయకులు మాధవరెడ్డి,నాగిరెడ్డి,గోరిశెట్టి బాబు సుధాకర్‌నాయుడు, జగదీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: టీడీపీ టికెట్ నంద్యాల వరదరాజులరెడ్డికి ప్రకటించాక వైసీపీ నుంచి వలసల పరంపర పెరిగిపోయింది. సోమవారం కొత్తపల్లె పంచాయతీ మూలవారిపల్లెలో సర్పంచ్ శివచంద్రారెడ్డి ఆధ్వర్యంలో 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి.వీరికి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి వరదరాజులరెడ్డి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు మురళీధర్‌రెడ్డి, మహ్మద్ గౌస్, టీడీపీ నాయకులు సుంకరవేణు, తాళ్ళమాపురం మల్లికార్జున, చిలకల క్రిష్ణారెడ్డి, బద్వేలి వాసు,నంగనూరు పల్లె నాగేశం పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో శివ,సురేష్, ఓబులేసు, దాసీ ప్రసన్న, రాజేష్ ,జయరాజు, గిరి వున్నారు.

ఆచారికాలనీ వాసులు టీడీపీలో చేరిక..: గోపవరం పంచాయతీ ఆచారి కాలనీకి చెందిన వైసీపీ నాయకులు పొన్నపురెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కుమ్మల శ్రీనివాసులరెడ్డి,కోనేటి ఓబయ్య, రమణ ,కామన ద్వారకనాధరెడ్డి రామసుబ్బారెడ్డి టీడీపీ కార్యాలయంలో వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం టీడీపీలో చేరారు.వీరికి పార్టీ కండువా కప్పి వరద ఆహ్వానించారు.

బద్వేలు టౌన్..: మున్సిపాలిటీ పరిధిలోని తిరువెంగలాపురం, గుంతపల్లె గ్రామంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితీశ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి వంద కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ఓటుతోనే బుద్ధి చెప్పి ఇంటికి సాగనంపాలని వారన్నారు. ఉమ్మడి అభ్యర్థి బొజ్జ రోశన్న గెలుపునకు ప్రతి ఒక్క రూకృషి చేయాలని ఆమె అన్నారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నాయకులు పొలిచర్ల గురునాథం,డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పొలిచర్ల వెంకటసుబ్బయ్య, రామయ్య, లక్షుమయ్య, బిజివేముల సుబ్బారెడ్డి, శేఖరరెడ్డి, నారాయణ, సుబ్బరామయ్య నాయుడు, శేషయ్యనాయుడు, శివరాంనాయుడు, భాస్కర్‌నాయుడు తదితర కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు టీఎస్‌రవి,వెంకటసుబ్బారెడ్డి, రాజారెడ్డి, రామసుబ్బారెడ్డి, యల్లారెడ్డి, ఊట్ల సుబ్బరామయ్య, భూపాల్‌రెడ్డి, బయన్న పాల్గొన్నారు.



బద్వేలులో టీడీపీలోకి ఆహ్వానిస్తున్న విజయమ్మ, రితీశ్‌కుమార్‌రెడ్డి

బాబాయ్, అబ్బాయ్‌లను గెలిపించండి

● మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి



గూడెం చెరువులో ఇంటింటి ప్రచారం చేస్తున్న నారాయణరెడ్డి

జమ్మలమడుగు, ఏప్రిల్ 15: జమ్మలమడుగు నియోజకవర్గం అభివృద్ధి జరగాలంటే సార్వత్రిక ఎన్నికల్లో బాబాయ్, అబ్బాయ్‌లను గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి ఇంటింటికి వెళ్లి అభ్యర్థించారు. సోమవారం సాయంత్రం జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువు గ్రామం, రాజీవ్‌నగర్ కాలనీలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ కడప పార్లమెంటు అభ్యర్థి భూపేశ్‌రెడ్డిని, జమ్మలమడుగు ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సురేష్, ఖాదర్, శ్రీనివాసులరెడ్డి, నల్లగట్ల బూషిరెడ్డి, రాజీవ్‌నగర్‌కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి: రోశన్న



ప్రచారం చేస్తున్న బీజేపీ అభ్యర్థి బొజ్జ రోశన్న

పోరుమామిళ్ల, ఏప్రిల్ 15 : తనకు ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలని బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్న అన్నారు. సోమవారం ఆయన పోరుమామిళ్లలోని జెస్తవీధి,62, 63వ పోలింగ్‌బూత్ ప్రాంతాల్లో, స్టార్ హైస్కూలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలంటూ విస్తృత ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ, జనసేన , టీడీపీ నాయకులు

బద్వేలు, ఏప్రిల్ 15: మున్సిపాలిటీ పరిధిలోని మిద్దెలవారిపాళెం, కోటవీధిలలో సోమవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు తుడిమెళ్ల మురళి, దద్దం వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు తుడిమెళ్ల సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అంతమొందించేందుకు ప్రజలు ఓటు అనే వజ్రాయుధంతో వారికి బుద్ధి చెప్పాలన్నారు. కూటమి అభ్యర్థి అయిన రోశన్నను కమలం గుర్తుపై ఓట్లువేసి మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కొర్రపాటి సురేంద్ర, పోలు సుధాకర్, పిడుగు సాయి, సింగంశెట్టి సుబ్బయ్య, అల్లం కుమార్, టీడీపీ నాయకులు బుజ్జి, తుడిమెళ్ల వెంకటసుబ్బయ్య, నానబాల వెంకటేశ్వర్లు, గురు రాజ, సతీ శ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డబుల్‌ఇంజన్ సర్కారుతోనే రాష్ట్రాభివృద్ధి

మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

బద్వేలు టౌన్, ఏప్రిల్ 15 : కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం డబుల్ ఇంజను సర్కారుతోనే అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బొజ్జ అరుణమ్మ అన్నారు. సోమవారం పట్టణంలోని సురేంద్ర నగర్‌లో టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలంటూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఊట్ల సరోజనమ్మ, పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ హబీబున్నీసా, కౌన్సిలరు శివమ్మ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తంగేడుపల్లెలో ఇంటింట ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

బి.కోడూరు, ఏప్రిల్ 15 : మండల పరిధిలోని తంగేడుపల్లె, ప్రభలవీడు గ్రామాల్లో ఉమ్మడి అభ్యర్థి రోశన్న గెలిపించాలంటూ మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, గోడి రమణారెడ్డి, అమర్‌నాథరెడ్డి, గోడి భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఉమ్మడి అభ్యర్థి బొజ్జ రోశన్నకు కమలం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటసుబ్బారెడ్డి, దుగ్గిరెడ్డి, రామ్మోహన్ రెడ్డి, పరిటాల వెంకటసుబ్బయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల ఫారెస్టు రేంజర్‌గా రఘునాథరెడ్డి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 15: పోరుమామిళ్లఫారెస్టు రేంజర్‌గా ఎర్రగుడి రఘునాథరెడ్డి సోమవారం బాధ్యతలుచేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా పెట్టి అరికడతామన్నారు. ఏదైనా సమాచారం ఉంటే 8309924821కి ఫోను చేయాలని చేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 15 : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ప్రొద్దుటూరులో అవగాహన కల్పించారు. సోమవారం అగ్నిమాపక సిబ్బంది శివాలయం సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ రఘునాధ, సిబ్బంది పాల్గొన్నారు

ఎన్డీయే కూటమితోనే అభివృద్ధి : ఆది



ప్రచారంలో మాట్లాడుతున్న ఆదినారాయణరెడ్డి

ముద్దనూరు ఏప్రిల్15: ఎన్డీయే కూటమితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఎన్డీయే అభ్యర్థులను గెలిపించాలని జమ్మలమడుగు నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. ముద్దనూరు గ్రామ పంచాయతీ పరిధిలోని చెన్నారెడ్డిపల్లె, డీఎస్‌పల్లె, ఎల్‌ఎంకాంపౌండ్, ఎస్వీగిరి కాలనీల్లో సోమవారం ఆదినారాయణరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా భూపేష్‌రెడ్డి ని గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురేంద్రనాథరెడ్డి, గోపాలక్రిష్ణయ్య, తులశయ్యవినోద్, టీడీపీ నాయకులు శివరామిరెడ్డి, అబ్దుల్‌ఖాదర్, బాబాఅమీర్ బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నరేంద్రమోదీ, చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి

జమ్మలమడుగు, ఏప్రిల్ 15: కేంద్రంలో నరేంద్రమోదీ, రాష్ట్రంలో చంద్రబాబు అధికారంలోకి వస్తేనే అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందని జమ్మలమడుగులోని ఆర్‌సీఎం చర్చిలో పలువురు తెలిపారు. సోమవారం సాయంత్రం జమ్మలమడుగు పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డులో ఆర్‌సీఎం చర్చిలో నియోజకవర్గంలోని దైవసేవకుల సదస్సు జరిగింది. ఈ సదస్సుకు జమ్మలమడుగు ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డిని, టీడీపీ కడప పార్లమెంటు అభ్యర్థి చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డిని ఆహ్వానించారు. అలాగే జనసేన నాయకులు నాగార్జున తదితర నేతలను ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో జమ్మలమడుగు నియోజకవర్గంలోని దైవసేవకులు టీడీపీ కడప పార్లమెంటు అభ్యర్థి భూపేశ్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డిని పాస్టర్లు ఆశీర్వదించారు.

ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించండి



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న బీజేపీ, టీడీపీ నాయకులు

పెద్దముడియం, ఏప్రిల్ 15 : రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆదినారాయణరెడ్డిని, కడప పార్లమెంటుకు పోటీ చేస్తున్న భూపేశ్ రెడ్డిలను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ నాయకుడు చదిపిరాళ్ల గోవర్ధనరెడ్డి ప్రజలను కోరారు. మండల పరిధిలోని పెద్దపసుపుల గ్రామంలో సోమవారం టీడీపీ, బీజేపీ నాయకులు ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, రాఘవరెడ్డి, సోమిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి ఇతర నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

రాచమల్లు అరాచకపాలనకు బుద్ధి చెప్పండి: వరద

ప్రొద్దుటూరు ,ఏప్రిల్ 15 : ప్రొద్దుటూరులో రాచమల్లు అరాచకపాలకు ప్రజలు బుద్ధి చెప్పే సమయం వచ్చిందని టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం 7,8 వార్డులలో టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీఎస్ ముక్తియార్, ఈవీ సుధాకర్‌రెడ్డి దేవగుడి వేణుగోపాల్‌రెడ్డి, జనసేననాయకులు పత్తి శివకళ్యాణ్, బీజేపీ నేత రాఘవేంద్ర పాల్గొన్నారు.

రాజుపాలెం..: మండల పరిధిలోని పర్లపాడు గ్రామంలో సోమవారం కార్యకర్తల మధ్య ప్రొద్దుటూరు టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. ముందుగా ఆయనకు కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సైకిలు గుర్తుకు ఓటు వేయాలని తనకు, ఎంపీ అభ్యర్థికి సైకిలు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నంద్యాల కొండారెడ్డి, టీడీపీ నాయకులు తోట మహేశ్వర్‌రెడ్డి, చెమికల పురుషోత్తంరెడ్డి ముక్తియార్, ప్రతాప్‌రెడ్డి, కుమ్మరపల్లె వెంకట్రాంరెడ్డి,బి.వెంకట్రామరెడ్డి, మానికింది ఖాదర్‌బాషా, శ్రీకాంత్‌రెడ్డి, ధనిరెడ్డి రామచంద్రారెడ్డి, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: టీడీపీతోనే రాష్ట్రంలో అన్నివర్గాల భవిష్యత్తు మారుతుందని, కడప ఎంపీగా చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యేగా నంద్యాల వరదరాజులరెడ్డిని గెలిపించాలని వారి కుటుంబ సభ్యులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. సోమవారం 2 వవార్డులో టీడీపీ ఎన్నికల ప్రచారాన్ని వరదరాజులరెడ్డి కుమార్తెలు అనురాధ అరుణ, కోడలు మీనా, భూపేష్‌రెడ్డి సతీమణి జ్యోతి చేపట్టారు. కార్యక్రమంలో బీజేపీ కార్యవర్గ సభ్యురాలు బోగా శివకళ్యాణి, పట్టణ అధ్యక్షురాలు కుమారి, బోగాల లక్ష్మీనారాయణమ్మ, లక్ష్మీ, అలివేలు, అంజనమ్మ, భానుమతి, భారతి, శైలజ, సుశీల, హసీనా, ధనియాల రాఘవరెడ్డి, ధనిరెడ్డిశ్రీధర్‌రెడ్డి,పాణ్యం నాగమునిరెడ్డి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: ఎమ్మెల్యే రాచమల్లు ఓటమితోనే ప్రొద్దుటూరుకు భవిష్యత్తు వుంటుందని టీడీపీ నేత మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సోముల వారిపల్లె పంచాయతీలోని 2,3,4 లలో టీడీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లె సర్పంచ్ శివచంద్రారెడ్డి, వెల్లాలభాస్కర్, కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి, మహ్మద్‌గౌస్ పాల్గొన్నారు.





ప్రొద్దుటూరు 7,8 వార్డుల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వరదరాజులరెడ్డి... భూపేశ్‌రెడ్డి, వరదను గెలిపించాలని ప్రచారం చేస్తున్న కుటుంబ సభ్యుల ప్రచారం, ఇంటింటి ప్రచారంలో మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి